


# విభారే

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 15 జూన్ 2021 సంపుటి : 02 సంచిక :327 పేజీలు : 4 వెల : రూ 3-00


## భూముల ఆక్రమణపై చర్యలు: మంత్రి కన్నబాబు

అమరావతి: 2020-21 సంవత్సరానికి రుణప్రణాళికను రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఏపీ ముఖ్యమంత్రి జగన్ విడుదల చేశారని మంత్రి కన్నబాబు తెలిపారు. సోమవారం మీడియాతో మంత్రి కన్నబాబు మాట్లాడుతూ.. కొవిడ్ కష్ట కాలంలో ఎన్ని ఇబ్బందులు వచ్చినా బ్యాంకర్లు సహకరించారని సీఎం సమావేశంలో తెలిపారన్నారు. వ్యవసాయ, విద్య, వైద్యరంగాలకు పెద్దఎత్తున మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. జగనన్న కాలనీల అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వానికి సహకరించాలని సీఎం బ్యాంకర్లను కోరారని చెప్పారు. కౌలురైతులకు సంబంధించి అత్యధికంగా రుణాలు ఇవ్వాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. సీసీఆర్సీ కార్డుల ఆవశ్యకతపై భూ యజమానులకు నష్టం లేకుండా ఓ క్యాంపెయిన్ చేపట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఎమ్మెస్సెమ్మీకి సంబంధించి రీస్టార్ట్, నవోదయ లాంటి పథకాల ద్వారా ముందుకు తీసుకెళ్లాలన్నారు.

## బీజేపీలో చేరిన ఈటల రాజేందర్




న్యూఢిల్లీ/ హైదరాబాద్: మాజీమంత్రి ఈటల రాజేందర్ బీజేపీ కండువా కప్పుకున్నారు. సోమవారం ఆయన బీజేపీలో చేరిపోయారు. ఇటీవల టీఆర్ఎస్‌కి గుడ్ బై చెప్పిన ఈటలకు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి తరుణ్ చుగ్ బీజేపీ సభ్యత్వం ఇచ్చారు. ఈటలతో పాటు మాజీ ఎంపీ రమేష్ రాథోడ్, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి , మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, తెలంగాణ ఆర్టీసీ నేత అశ్వద్ధామ రెడ్డి బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్, పార్టీ ఎంపీలు ధర్మపురి అరవింద్, సోయం బాపురావు, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఎమ్మెల్యే రఘునందన్ రావు, మురళీధర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలు బీజేపీని ఆదరిస్తున్నారని తెలిపారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అదేవిధంగా ఈటల రాజేంద్రర్ మాట్లాడుతూ.. తెలంగాణలో బీజేపీని బలోపేతం చేస్తామని అన్నారు. బీజేపీ విశ్వాసాన్ని వమ్ము చేయకుండా శ్రమిస్తామని తెలిపారు. రాబోయే రోజుల్లో బీజేపీలోకి మరిన్ని చేరికలు ఉంటాయని ఈటల వెల్లడించారు. కాసేపట్లో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఇంటికి ఈటల బృందం వెళ్లనుంది. ఈటల రాజేందర్‌కు జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పార్టీ కండువా కప్పనున్నారు. ఈటలతో పాటు వచ్చిన ఇతర అనుచరులకు తన నివాసంలో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్ రెడ్డి పార్టీ కండువా కప్పనున్నారు. అనంతరం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి.. పార్టీ నేతలందరికీ తన నివాసంలో లంచ్ ఏర్పాటు చేయనున్నారు. అనంతరం ఈ సాయంత్రం కేంద్ర హోంమంత్రి అమిత్ షాను ఈటల రాజేందర్ కలవనున్నారు. భూఆక్రమణల ఆరోపణలు నేపథ్యంలో ఈటల రాజేందర్.. కొద్ది రోజుల కిందటే టీఆర్ఎస్‌కు గుడ్ బై చెప్పారు. భూకబ్జా ఆరోపణల కారణంగా ఈటలను ఇటీవల టీఆర్ఎస్ ప్రభుత్వం మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసింది. అనంతరం పార్టీ, ఎమ్మెల్యే పదవులకు ఆయన రాజీనామా చేశారు. దీంతో హుజూరాబాద్ నియోజకవర్గం ఉప ఎన్నిక అనివార్యం అయింది.

## సీఎం జగన్ అధ్యక్షతన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశం



### వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరించిన సీఎం
### మొత్తం రూ.2,83,380 కోట్ల రుణ ప్రణాళిక




తాడేపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన 215వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ(ఎస్ఎల్‌బీసీ) సమావేశం సోమవారం జరిగింది. వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు, వ్యవసాయశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ పూనం మాలకొండయ్య, పరిశ్రమల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కరికాల వలవెన్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.ఎస్.రావత్, సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి కె.సునీత, ఆర్థిక శాఖ కార్యదర్శి సత్యనారాయణ, వ్యవసాయశాఖ కమిషనర్ హెచ్ అరుణ్‌కుమార్, సెర్ప్ సీఈవో, పి.రాజాబాబు, ఎస్ఎల్‌బీసీ, ఏపీ, కన్వీనర్ వి బ్రహ్మానందరెడ్డి, నాబార్డు సీజీఎం, సుధీర్ కుమార్ జన్నావర్‌తో పాటు వివిధ బ్యాంకులకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఎండీ, సీఈఓ రాజ్ కిరణ్ రాయ్, ఆర్‌బీఐ జీఎం యశోధా భాయి పాల్గొన్నారు. వార్షిక రుణ ప్రణాళికను సీఎం వైఎస్ జగన్ ఆవిష్కరించారు. మొత్తం 2.83 లక్షల కోట్లతో రుణ ప్రణాళికను రూపొందించారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మాట్లాడుతూ, వ్యవసాయరంగానికి రూ.1.48,500 కోట్లు ఇవ్వాలన్నదే లక్ష్యమని పేర్కొన్నారు. వ్యవసాయరంగంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంపై దృష్టి పెట్టామన్నారు. రుణాల పంపిణీలో నిర్దేశించుకున్న లక్ష్యాలకన్నా అధికంగానే చేపట్టామని.. కొన్ని అంశాల్లో బ్యాంకుల సమర్థత పెరగాల్సి ఉందని సీఎం తెలిపారు. "నాడు-నేడు కింద స్కూళ్లు, ఆస్పత్రులను అభివృద్ధి చేస్తున్నాం. ప్రభుత్వ స్కూళ్లల్లో ఇంగ్లీష్ మీడియం తీసుకొచ్చాం. విలేజ్ క్లినిక్స్, టీచింగ్ ఆస్పత్రులపై ప్రత్యేక దృష్టి పెట్టాం. 6 కొత్త మెడికల్ కాలేజీలను తీసుకొస్తున్నాం. ప్రతి పార్లమెంట్ పరిధిలో ఒక టీచింగ్ ఆస్పత్రి ఏర్పాటు చేస్తున్నాం. ఎంఎస్ఎంఈల కోసం రీస్టార్ట్, నవోదయ కార్యక్రమాలు చేపట్టాం. కోవిడ్ సమయంలో వాటికి చేయూతనిచ్చి నడిపించాల్సిన అవసరం ఉంది. తొలి విడతలో 15 లక్షలకుపైగా ఇళ్లను నిర్మిస్తున్నాం. 17 వేలకుపైగా కొత్త కాలనీలను నిర్మిస్తున్నాం. కాలనీల్లో తాగునీరు, డ్రైనేజ్, రోడ్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. వీటి కోసం సుమారు రూ.34వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. మహిళా సాధికారిత కోసం అనేక చర్యలు తీసుకున్నాం. ఆసరా, చేయూత ద్వారా మహిళలను ఆదుకుంటున్నాం. అమ్మఒడి కింద నేరుగా వారి ఖాతాల్లోనే డబ్బు జమ చేస్తున్నాం. ఈ పథకాలు మహిళా సాధికారితలో కీలకపాత్ర పోషిస్తున్నాయనివవ సీఎం వైఎస్ జగన్ వివరించారు.

## గవర్నర్ బిశ్వభూషణ్‌ని కలిసిన సీఎం జగన్ దంపతులు



అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దంపతులు సోమవారం గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ని కలిశారు. మర్యాదపూర్వక భేటీలో భాగంగా రాజ్‌భవన్‌కు సతీసమేతంగా వెళ్లిన జగన్ దంపతులు గవర్నర్‌తో సమావేశమయ్యారు. గవర్నర్ బిశ్వభూషణ్‌తో సీఎం జగన్ భేటీ ముగిసింది. పలు కీలక అంశాలపై గవర్నర్‌తో దాదాపు 40 నిమిషాలపాటు చర్చించారు సీఎం జగన్. లేడీ గవర్నర్ సుప్రవాహరిచందన్‌ని సీఎం సతీమణి వైఎస్ భారతి మర్యాదపూర్వకంగా కలిశారు. భేటీ అనంతరం సీఎం దంపతులు రాజ్ భవన్ నుంచి కాంపు కార్యాలయానికి బయలుదేరారు.

## 'ఒకే దేశం- ఒకే రేషన్' అమలుకు అభ్యంతరం లేదు : మమత



కోల్‌కతా : 'ఒకే దేశం- ఒకే రేషన్'వ విధానాన్ని అమలు చేయడానికి తమ ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరమూ లేదని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటించారు. అయితే.. అది ప్రక్రియలో ఉందని పేర్కొన్నారు. 'ఒకే దేశం- ఒకే రేషన్'వ విధానాన్ని బెంగాల్‌లో అమలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇది వలస కూలీలకు సంబంధించిన అంశమని, దీనిని రాష్ట్రంలో వెంటనే అమలు చేయాలని సుప్రీం ఆదేశించింది. ఈ నేపథ్యంలో సీఎం మమత పై విధంగా ప్రకటన చేశారు. కోవిడ్ దృష్ట్యా రాష్ట్రంలో అమలులో ఉన్న ఆంక్షలను జూలై 1 వరకూ పొడిగిస్తున్నట్లు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటించారు. అయితే అత్యవసర సర్వీసులకు మాత్రం మినహాయింపు ఉంటుందని పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు యథావిధిగానే పనిచేస్తాయని, కేవలం 25 శాతం ఉద్యోగులతో, ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పనిచేస్తాయని తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సడలింపులు ఉంటాయని, రెస్టారెంట్లు, బార్లు మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 8 గంటల వరకూ తెరుచుకోవచ్చని సూచించారు.

## గ్రామ పాలనలో విప్లవాత్మక మార్పులు: మంత్రి పెద్దిరెడ్డి

### గ్రామ సర్పంచ్‌లతో మంత్రి పెద్దిరెడ్డి వీడియో కాన్ఫరెన్స్

అమరావతి: గ్రామీణ పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. సచివాలయ, వాలంటీర్ వ్యవస్థలతో పల్లె ముంగిట్లోకే పాలన వచ్చిందన్నారు. గ్రామ సర్పంచ్‌లతో ఆయన సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామాల్లో ::జగనన్న స్వచ్ఛ సంకల్పం:: అమలుపై చర్చించారు. జూలై 8న జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారని ఆయన తెలిపారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం కోసం రూ.1312.04 కోట్లు కేటాయించినట్లు ఆయన తెలిపారు. సర్పంచ్‌లంతా గ్రామసచివాలయ వ్యవస్థను ఉపయోగించుకోవాలని మంత్రి పెద్దిరెడ్డి అన్నారు. ఆరోగ్యకరమైన గ్రామాలే లక్ష్యంగా స్వచ్ఛసంకల్పానికి సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారన్నారు. "గ్రామ సర్పంచ్‌ల భాగస్వామ్యంతోనే పల్లెల రూపురేఖలు మారుతాయి. ప్రజాప్రతినిధులుగా మీ ఎదుగుదలకు సర్పంచ్ పదవి తొలిమెట్టు. ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలి. పట్టణాలకు ధీటుగా గ్రామాలను తీర్చిదిద్దాలి. ప్రతిగ్రామం పరిశుభ్రత, పచ్చదనంతో కళకళలాడాలి. స్వచ్ఛసంకల్ప కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములను చేయాలనివవ మంత్రి పెద్దిరెడ్డి పిలుపునిచ్చారు.



## తగ్గుముఖం పడుతున్న కరోనా కేసులు

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో కోవిడ్ కేసులు భారీగా తగ్గుముఖం పడుతున్నాయి. గడిచిన 24 గంటల్లో 4,549 పాజిటివ్ కేసులు వెలుగుచూశాయి. నిన్న ఒక్కరోజే 10,114 మంది కరోనా నుంచి కోలుకొని డిశ్చార్జ్ అయ్యారు. ఆదివారం రోజు 87,756 మందికి కరోనా పరీక్షలు నిర్వహించారు. ఇక గత 24 గంటల్లో 59 మంది మృత్యువాత పడ్డారు. ఈమేరకు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కోవిడ్‌పై సోమవారం హెల్త్ బులిటెన్ విడుదల చేసింది. దీంతో మొత్తం కేసుల సంఖ్య 18,14,393 చేరగా.. మరణాల సంఖ్య 11,999గా ఉంది. ఇప్పటి వరకు రాష్ట్రంలో 2,05,38,738 మందికి కరోనా పరీక్షలు పూర్తి చేశారు. 1,72,23,81 మంది కోలుకున్నారు. ఏపీలో ప్రస్తుతం 80,013 యాక్టివ్ కేసులు ఉన్నాయి.

## తప్పు ఎవరు చేసినా శిక్ష తప్పదు: మంత్రి అవంతి

### కుట్రలు, కుతంత్రాలు పన్నడమే చంద్రబాబు పని
### మంత్రి అవంతి శ్రీనివాస్

విశాఖపట్నం: చంద్రబాబు ఐదేళ్ల పాలనలో దోచుకోవడం, దాచుకోవడమేనని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి అవంతి శ్రీనివాస్ మండిపడ్డారు. సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, తప్పు ఎవరు చేసినా శిక్ష తప్పదన్నారు. సీఎం జగన్‌కు తన, మన, పార్టీ, కులం తారతమ్యాలు లేవని తెలిపారు. చంద్రబాబుకు టీడీపీపైనా, ఆ పార్టీ నాయకులపైనా పట్టులేదని.. ఆయనకు పబ్లిసిటీ పిచ్చి తప్ప మంచి చేద్దామనే ఆలోచన ఉండదని ధ్వజమెత్తారు. కుట్రలు, కుతంత్రాలు పన్నడమే చంద్రబాబు పని అని దుయ్యబట్టారు. మూడు ప్రాంతాలు అభివృద్ధి చేయాలన్నదే తమ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. విశాఖ బ్రాండ్ ఇమేజ్‌ను చెడగొట్టొద్దని మంత్రి అవంతి శ్రీనివాస్ హితవు పలికారు.



## మాన్సాస్ ట్రస్టు విషయంలో హైకోర్టు తీర్పు హర్షణీయం: చంద్రబాబు



అమరావతి: మాన్సాస్ ట్రస్టు విషయంలో హైకోర్టు తీర్పు హర్షణీయమని టీడీపీ అధినేత చంద్రబాబు వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ న్యాయంపై అన్యాయం గెలవడం అసాధ్యమని మరోసారి తేలిందని హెచ్చరించారు. మాన్సాస్ ట్రస్టు విషయంలో ప్రభుత్వ చీకటి జీవోలను కొట్టేస్తూ.. హైకోర్టు ఇచ్చిన తీర్పు తుగ్లక్ సీఎంకి చెంపపెట్టన్నారు. మాన్సాస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉన్న దేవాలయాల ఆస్తుల్ని, వేలాది ఎకరాల భూముల్ని కొల్లగొట్టాలని జగన్ రెడ్డి దుర్మార్గపు ఆలోచనకు చట్టం అడ్డుకట్ట వేయడం హర్షణీయమని చంద్రబాబు పేర్కొన్నారు. అప్రజాస్వామికంగా ఎన్ని చీకటి జీవోలు ఇచ్చినా చట్టం ముందు న్యాయానిదే గెలుపు అని నిరూపించిందన్నారు. పూసపాటి వంశీకులు ఆదరించిన లక్షలాది మంది విద్యార్థులు.. వేలాది మంది ఉద్యోగులకు హైకోర్టు తీర్పు ఊపిరినిచ్చిందని చంద్రబాబు అన్నారు. "అలుపెరుగక న్యాయ పోరాటంతో ట్రస్టును కాపాడుకోవడం అశోక్ గజపతిరాజుతో పాటు ట్రస్టు ద్వారా ఆదరింపబడుతున్న అందరి విజయం. న్యాయంపై అన్యాయం గెలవడం అసాధ్యమం. దేశంలో ఏ సీఎం కూడా కోర్టులతో ఇన్నిసార్లు తలంటించుకున్నది లేదు. కోర్టులిచ్చే తీర్పులతో అయినా.. జగన్ రెడ్డి మూర్ఖత్వం వీడాలి. అధికారులు గుడ్డిగా జీవోలివ్వడం మానుకోవాలి. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ వ్యవస్థలను హరించేలా నిరంకుశ పాలన సాగిస్తున్న.. జగన్ రెడ్డికి ఈ తీర్పుతో నైనా కనువిప్పు కలగాలి చంద్రబాబు వ్యాఖ్యానించారు.

### జీవో నెం.72ను కొట్టివేసిన హైకోర్టు
### అశోక్ గజపతి రాజు కు సింహాచలం బాధ్యతలు

అమరావతి మాజీ మంత్రి, తెలుగు దేశం నేత అశోక్ గజపతి రాజు రిట్ పిటిషన్లపై హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. మాన్సాస్, సింహాచలం ట్రస్టుల ఛైర్పర్సన్ నియామక జీవోను సవాలు చేస్తూ కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.72ను హైకోర్టు కొట్టివేసింది. సింహాచలం వరహాలక్ష్మి నరసింహ దేవస్థానానికి, మానస ట్రస్ట్ కు ఆయనే చైర్మన్ గా ఉండేలా ఆదేశాలు జారీ చేసింది. గతంలో మానస ట్రస్టీ, వారహాలక్ష్మి నరసింహ దేవస్థానం చైర్మన్ గా ఉన్న అశోక్ గజపతి రాజును ప్రభుత్వం తొలగించిన విషయం తెలిసిందే. అయన స్థానంలో సంచయితను నియమిస్తూ 72 జీవోను విడుదల చేసింది.

## ఫ్రంట్‌లైన్ వర్కర్లకు ఏపీ ప్రభుత్వం భరోసా

విజయవాడ : ఫ్రంట్‌లైన్ వర్కర్లకు ఏపీ ప్రభుత్వం భరోసానిచ్చింది. జూనియర్ డాక్టర్ల ఎక్స్‌గ్రేషియా డిమాండ్‌ను నెరవేర్చింది. కోవిడ్‌తో మరణించే వైద్యులు, సిబ్బందికి ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. కోవిడ్ విధి నిర్వహణలో మృతి చెందిన వైద్యుని కుటుంబానికి రూ.25 లక్షలు.. స్టాఫ్ నర్సుకి రూ.20 లక్షలు, ఎఫ్ఎన్ఓ లేదా ఎమ్ఎస్ఓలకు రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా.. ఇతర వైద్య సిబ్బంది మృతి చెందితే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం చెల్లించే ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ పథకానికి అదనంగా ఈ ఎక్స్‌గ్రేషియా చెల్లించనున్నట్లు ఉత్తర్వులలో వెల్లడించింది. తక్షణమే ఎక్స్‌గ్రేషియా అందేలా కలెక్టర్లకు అధికారం ఇచ్చింది. జిల్లా కలెక్టర్ల సంబంధిత డాక్యుమెంట్లు పరిశీలించి ఎక్స్‌గ్రేషియా ఇచ్చేలా ఆదేశాలు జారీ చేసింది.

# సంపాదకీయం

మంగళవారం 15 జూన్ 2021

## పెట్రోల్ పాపం తలాపిడికెడు

వాక్సిన్ల బాధ్యతను కేంద్రమే తీసుకుంటుందని తాజాగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఊపిరి పీల్చుకున్నాయి. ఇందులో ఏదో మతలబు ఉందని రాజకీయ వర్గాలు అనుమానిస్తున్నాయి. కరోనా వాక్సిన్లు, పేదల సాయం పేరిట కేంద్ర ప్రభుత్వానికి లక్షా ఇరవై అయిదువేల కోట్ల రూపాయల మేరకు భారం పడుతుందని అంచనాలు రూపొందించారు. ఎలాగూ రాష్ట్రాలు చేతులెత్తేశాయి. కేంద్రమే బాధ్యత వహిస్తోంది కాబట్టి కొత్త సెస్సు వేసేందుకు సమాయత్తం అవుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలు సైతం ఏమీ మాట్లాడలేని పరిస్థితి. వాటిపై భారం తగ్గిందనే సాకు చూపిస్తారు. ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ ప్రభుత్వాలు వాక్సిన్లు సొంతంగా సమకూర్చుకోవాలంటే తెలంగాణ 3వేల కోట్ల రూపాయలు, ఏపీ 4,200 కోట్ల రూపాయలు వెచ్చించాల్సి ఉంటుందని లెక్కలు వేసుకున్నాయి. అలాగే తమ జనాభాను బట్టి ఇతర రాష్ట్రాలూ వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టా?ల్సి వచ్చి ఉండేది. ఈ భారమంతా కేంద్రం తీసుకుంటోంది. అందువల్ల ఖజానా నింపుకోవడానికి కొత్త సెస్సు వేస్తామని చెప్పే అవకాశాలున్నాయంటున్నారు. జీఎస్టీ సమావేశాల్లో భాగంగా కేంద్రం, రాష్ట్రాలతో భేటీ కానుకుంది. ఈ సమావేశం అనంతరం కేంద్రం తమ కొత్త పన్నును ప్రజలపై రుద్దే అవకాశం ఉందనేది రాజకీయ వర్గాల సమాచారం.నిజానికి వాక్సిన్లలో 75 శాతం కేంద్రం సేకరించి 25 శాతం ప్రయివేటు ఆసుపత్రుల కొనుగోలు కు అవకాశం ఇస్తోంది. కేంద్రానికి ఒక్కో డోసు 150 రూపాయలకే లభిస్తోంది. ప్రయివేటు ఆసుపత్రులు అందించే టీకాలు, చిన్నపిల్లలకు మినహాయింపు తీసేస్తే కేంద్రం రెండు విడతలు కలిపి 120 కోట్ల డోసులు సేకరిస్తే సరిపోతుంది. గరిష్టంగా 36 వేల కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు అవుతుంది. ఇప్పటికే బడ్జెట్ లో 35వేల కోట్లను కేంద్రం కేటాయించింది. అంటే కేంద్రం కొత్తగా ఖర్చు చేసేదేమీ ఉండదు. కానీ రాష్ట్రాల వంతు బాధ్యతను కూడా తామే తీసుకుంటున్నామనే నెపంతో కరోనాను సెస్సు రూపంలో ఎన్ క్యాష్ చేసుకునే ఎత్తుగడలో కేంద్రం ఉందని రాజకీయ వేత్తలు, ఆర్థిక వేత్తలు భావిస్తున్నారు. అందుకే కరోనా బారం లక్షా ఇరవై అయిదువేల కోట్ల రూపాయలంటూ కేంద్రం కొత్త లెక్కలు చెబుతోంది. ఒక్క దెబ్బకు రెండు పిట్టలు అన్నట్లుగా రాష్ట్రాల నిస్సహాయతను తమకు అనుకూలంగా మలచుకోదలచింది. రాష్ట్రాలు కూడా టీకాల బాధ్యత వహించి ఉంటే సెస్సు విధించడం సాధ్యమయ్యేది కాదు. ఒకవేళ విధించినా ఈ పన్నులో తమ వంతు వాటా కోసం రాష్ట్ర ప్రభుత్వాలు డిమాండ్ చేసి ఉండేవి.నిజానికి ప్రజలు ఇప్పటికే పీకల్లోతు కష్టాల్లో ఉన్నారు. ఆదాయాలు పడిపోయాయి. కొత్తగా సెస్సులు విధిస్తే తట్టుకోగల పరిస్థితి లేదు. ప్రజలను తమను అధికారంలోకి తెచ్చే ఓటర్లుగాను, పన్ను చెల్లింపు యంత్రాలుగానూ మాత్రమే రాజకీయ పార్టీలు చూస్తున్నాయి. నాణ్యమైన మానవ వనరులుగా, దేశానికి భవిష్యత్తుగా భావించడం లేదు. వ్యవస్థీ కృత విధానాలతో ప్రజలను పన్నుల రూపంలో బాదేస్తున్నాయి. ఇందుకు కేంద్రం, రాష్ట్రం అనే తేడా లేదు. వాటాల కోసమే తప్ప ప్రజలకు ఉపశమనం కలిగించాలనే విషయంలో ఏ రాజకీయ పార్టీ ప్రభుత్వమూ డిమాండ్ చేయడం లేదు. కేంద్రాన్ని తీవ్రంగా వ్యతిరేకించే వామపక్షాలు, మమతా బెనర్జీ వంటి వారు కూడా జీఎస్టీ పన్నుల వంటి వాటిపై హెచ్చరికలు పంపడం లేదు. మొక్కుబడి ప్రకటనలతో కేంద్రానికి నిరసన తెలపడం మినహా జీఎస్టీ కౌన్సిల్ లో తీవ్రస్థాయిలో విభేదించడం లేదు. తమ రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా పన్నుల్లో వాటా ఉండటమే ఇందుకు కారణం. దేశ వ్యాప్తంగా ఏకీకృత పన్నుతో అధిక మొత్తాల్లో ప్రజల నుంచి నిధులను రాబడుతున్న దేశాల్లో భారత్ కూడా ఒకటిగా నిలుస్తోంది.రాజకీయ విభేదాలే తప్ప కేంద్రం, రాష్ట్రాలు ప్రజలపై విధించే పన్నుల విషయంలో ఏకాభిప్రాయంతోనే ముందుకు పోతున్నాయి. పెట్రోలియం ఉత్పత్తులపై పన్నులు ఇందుకు ఉదాహరణ. జీఎష్టీ లోకి తీసుకురాకుండా ప్రభుత్వాలు వీటిపై ఎడాపెడా పన్నులు బాదుతూ ఖజానాను నింపుకుంటున్నాయి. కేంద్రానికి ఎక్సైజ్ పన్నుకు తోడు అదనపు సెస్సుల రూపంలో లక్షల కోట్లు సమకూరుతున్నాయి. రాష్ట్రాలకు అమ్మకం పన్ను రూపంలో వేల కోట్ల రూపాయలు వస్తున్నాయి. కేంద్రం పన్నులోనూ వాటా వస్తోంది. అందుకే ఏ ఒక్క రాష్ట్ర ప్రభుత్వం కూడా పెట్రోలియం రేట్లపై , పన్నులపై తమ నిరసనను తెలపడం లేదు. దొంగలు , దొంగలు ఊళ్లు పంచుకున్నారనే మొరటు సామెతకు నిదర్శనగా ప్రభుత్వాలు నిలుస్తున్నాయి. దేశంలో రవాణా, పారిశ్రామిక, వ్యవసాయ రంగాలకు అన్నిటికీ అవసరమైన పెట్రోలియం ఉత్పత్తులను జీఎస్టీ పరిధిలోకి తేవాలి. అప్పుడు నిర్ణీత పరిధిని మించి పన్ను విధించడం సాధ్యం కాదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60శాతం పైగా పెట్రోలు, డీజిల్ పై పన్నులు వసూలు చేస్తున్నాయి. కేవలం నలభై రూపాయలకు లభించాల్సిన పెట్రోలు లీటరు వంద రూపాయలు దాటింది. అదే జీఎస్టీ పరిధిలోకి తెస్తే గరిష్ట స్థాయిలో 28 శాతానికి మించి పన్ను విధించడం సాధ్యం కాదు. అందులోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్నుల వాటా ఉంటుంది. పెట్రోలియం ఉత్పత్తులు లీటర్ 70 రూపాయలకే లభిస్తాయి. ప్రజలకు ఇటువంటి సదుపాయం కల్పించడం కేంద్ర, రాష్ట్రాలకు ఇష్టం లేదు. అందుకే ఒకే దేశం ఒకే పన్ను అంటూ జీఎస్టీని తెచ్చినా పెట్లోలు, మద్యం మాత్రం మినహాయించుకుని ప్రజలపై అదనపు భారం మోపుతున్నాయి. జీఎస్టీ అమలవుతున్న దేశాల్లో ఎక్కడా లేని ద్వంద్వ విధానం ఇది.

# మారుతున్న సీజన్...

## దోమలతో జరా భద్రం



ఒంగోలు, జూన్ 14, (న్యూస్ పల్స్) కంటికి కూడా అంతగా కనిపించని జీవి దోమ మన ఒంటికి చేసే కీడు అంతా ఇంతా కాదు. మన రక్తం పీల్చి అది బతికేస్తుంది. మన ప్రాణాలను మాత్రం ప్రమాదంలోకి నెట్టేస్తుంది. ఏడిస్ ఈజిప్టై అనే ఆడ దోమతో ప్రమాదం ఇది. పగటి పూట ఈ దోమ కుడితే కొన్ని రోజుల్లోనే డెంగీ బారిన పడతాం.వర్షాకాలం వస్తే భయపెట్టే వ్యాధుల్లో మలేరియా, టైఫాయిడ్, డెంగీ ప్రధానం. డెంగీ వణికించే వ్యాధి. వర్షాకాలం దోమలకు ఆయువు పట్టు. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా ప్రాణాలను హరిస్తుంది. ఏటా జూన్ నుంచి అక్టోబరు వరకు వందల సంఖ్యలో ప్రజలు దీని బారిన పడుతున్నారు. పరిసరాల పరిశుభ్రతతోనే దీనిని నియంత్రించవచ్చును. జ్వరంతో ప్రారంభమై అంతర్గత రక్తస్రావం వరకు చేరుకొని చివరికి ప్రాణాలను బలిగొంటుంది.దోమలపై నిరంతరం దండయాత్ర చేస్తేనే ఇటువంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త పడొచ్చు. పరిశుభ్రత లోపించిన చోట ఈ సమస్య తలెత్తుంది. పంచాయితీరాజ్, పురపాలక సంఘాలకు లేఖలు రాశాం. డెంగీ కేసులు వస్తున్న దగ్గర వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం. అనుమానిత లక్షణాలతో ఎవరున్నా చికిత్స తీసుకోవడమే సత్వర ఉపశమనం. సొంత నిర్ణయం తీసుకొని..సొంత వైద్యంతో ప్రాణాల మీదకు తెచ్చుకోరాదు. లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యుడ్ని కలిసి చికిత్స తీసుకుంటే వేగంగా కోలుకోవచ్చు. కేంద్ర ఆసుపత్రిలో దీనికి సంబంధించి ప్రయోగశాల ఉంది. ఉచితంగానే పరీక్షలు అందిస్తారు. డెంగీలో మరో రకం డెంగీ హీమరేజిస్ ఫీవర్. ఇది ప్రమాదకరమైనది. శరీరంలో ఏ భాగంలోనైనా అంతర్గత రక్తస్రావం జరుగుతుంది. చర్మంపై ఎర్రటి మచ్చలు కనిపిస్తాయి. ముక్కు నుంచి రక్తస్రావం, రక్తవాంతులు, మెదడు, పొట్ట, ఊపిరితిత్తుల్లో రక్తస్రావం వంటి లక్షణాలు కనిపిస్తాయి. రక్తాన్ని గడ్డకట్టించే ప్లేట్‌లెట్స్ బాగా తగ్గిపోవడంతో ఈ సమస్య ఏర్పడుతుంది.డెంగీలో మరో రకమైన వ్యాధి ఇది. శరీరంలో ఫ్లూయిడ్స్ పడిపోవడం, శరీరం లోపల అవయవాల్లో రక్తస్రావం జరగడం ద్వారా నాడీ వ్యవస్థ బలహీనపడుతుంది. దీంతో బీపీ పడిపోవడం, కాళ్లు, చేతులు వణకడం, తీవ్రమైన దాహం వంటి లక్షణాలు కనిపిస్తాయి. డెంగీ హీమరేజిస్, సిండ్రోమ్ వచ్చినప్పుడు ఆసుపత్రిలో అత్యవసర చికిత్స అందించాలి. జ్వరం వచ్చిన వెంటనే సొంత వైద్యం కాకుండా వైద్యులను సంప్రదించాలి. చల్లని నీటితో శరీరాన్ని తుడవాలి. చల్లని ప్రదేశంలో పడుకోబెట్టాలి. తగ్గిన ప్లేట్‌లెట్స్‌ను వైద్యుల సలహా మేరకు ఎక్కించాలి.పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమలు రాకుండా, కుట్టకుండా నివారించాలి. దోమ తెరలు విరివిగా వాడాలి. తరచూ జ్వరం వస్తే డెంగీ వచ్చిందనుకోరాదు. అలా అని నిర్లక్ష్యం చేయరాదు. మలేరియా, టైఫాయిడ్ లక్షణాలు కూడా ఇంచుమించు ఇలాగే ఉంటాయి. వ్యాధి నిర్ధరణతోనే చర్యలు తీసుకోవాలి. చికిత్సతో పాటు ఆహార నియమాలు పాటించాలి. తేలికగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలు తీసుకోవాలి. ఫ్లూయిడ్స్ ఎక్కువుగా ఇవ్వాలి. ఓఆర్ఎస్ ద్రావణం తాగించాలి. మజ్జిగ, కొబ్బరి నీరు పట్టించాలి. పండ్ల రసాలు ఎక్కువుగా ఇవ్వాలి.

# చిత్తడవుతున్న రాజమండ్రి నగర వీధులు

రాజమహేంద్రవరం, జూన్ 14, (న్యూస్ పల్స్) చినుకు పడితే రాజమహేంద్రవరం నగర వీధులు చిత్తడిగా మారుతున్నాయి. మురికి కాల్వలు పొంగి ప్రవహిస్తున్నాయి. కొన్ని సార్లు ప్రధాన రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. కొన్ని కాలనీలు, బస్టాండ్లు లోతట్టు ప్రాంతాలు రోజుల తరబడి మురుగు నీటితో ముంపు బారిన పడుతున్నాయి. వర్షాకాలంలో ఇంటి నుంచి అడుగు బయటపెట్టేందుకు నగర వాసులు సంశయించాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. పాలకులకు, పాలనా యంత్రాంగానికి ఏ మాత్రం పట్టడం లేదు. ఫలితంగా ప్రతి వర్షాకాలంలో నగరం మురిగి నీటి ముంపు గురికాక తప్పడం లేదు. మరి ఈసారైనా ముంపు నుంచి బయటపడే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.వర్షాకాలంలో రాజమహేంద్రవరం నగర వీధులు చెరువులను తలపిస్తున్నాయి. నగర జనాభా ప్రస్తుతం సుమారు రూ.5.5 లక్షలకు చేరినట్టు అంచనా. నగరంలో 54 డివిజన్లు ఉన్నాయి. మొత్తం 618 కిలోమీటర్లు మేర డ్రైనేజీ వ్యవస్థ నడుస్తోంది. దీనిలో ప్రధాన కాలువలు 33 కిలోమీటర్లు కాగా, మైనర్ డ్రైనేజీలు 528 కిలోమీటర్లు ఉన్నాయి. వీటన్నింటి ఆధునికీకరణ చేపట్టాలన్నది ఏళ్లనాటి అజెండాగా ఉంది. కానీ పాలకులు మారుతున్నా, కాలువ ఆధునికీకరణ, వాటి అభివృద్దికి మాత్రం నోచుకోవడం లేదు. ఈ తరుణంలోనే ఏటా గోదావరి నది వరద నీరు వచ్చినపుడు నగరంలోని మురుగునీరు బయటకు వెళ్లే పరిస్థితి లేక, ప్రధాన రహదాలు, బస్‌స్టాండ్లు ముంపుకు గురవడం ఆనవాయితీగా వస్తుంది. నగరంలోని మురుగు నీటిని శుద్ధి చేసి, గోదారిని కలుషితం చేయకుండా చేయాలన్నది కలగానే మిగిలిపోతోంది. రాజమహేంద్రవరం డ్రైనేజీ వ్యవస్థను గాడి పెట్టే విషయంలో పాలనా యంత్రాంగం నిర్లక్ష్యంగానే ఉందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ప్రస్తుతం వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో ఇప్పటికైనా తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.నగరంలోని మురుగు కాలువలను రెండు బాగాల్లో చూడవచ్చు. అందులో ప్రధానమైనది 'నల్లా ఛానల్' ఇది నగరంలోని ప్రధాన ప్రాంతాల గుండా మూడో పట్టణ పోలీసు స్టేషన్ మీదుగా వెళ్లి గోదావరిలో కలుస్తుంది. దీనికి ప్రత్యేక లైన్ వేయాలన్నది ఎప్పుటి నుంచో వినిపిస్తున్న ప్రతిపాదన. రెండవది 'ఆవ చానల్' ఇది రామకృష్ణా థియేటర్ నుంచి ప్రారంభమై చివరికి సాయిబాబా గుడిదగ్గర నదిలో కలుస్తుంది. దీనికి సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టిపి) ద్వారా మురుగు కాలువలోని నీటిని శుద్ధి చేయాలని ఏర్పాటు చేశారు. కానీ దీని నిర్వహణకు కావల్సినంత మంది సాంకేతిక సిబ్బంది లేక పోవడంతో దీని నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంది. ఇలా సుదీర్ఘకాలం నుంచి కాలువల ఆధునీకరణ పనులు కలగానే మిగిలిపోతోంది. దీంతో ఏటా వర్షా కాలంలో నగర రోడ్లు ముంపుకు గురవుతున్నాయి.నగరంలో మురుగు కాలువల బెడదను నిర్మూలించేందుకు టిడిపి హయాంలో డైవర్సన్ ఛానల్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ముందుకొచ్చింది. అప్పట్లో డైవర్సన్ ఛానల్ నిర్మాణానికి రూ.80 కోట్లతో ప్రణాళికలు రూపొందించినా ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిసి ప్రభుత్వం డైవర్సన్ ఛానల్ ఊసెత్తలేదు. పైగా గత ప్రభుత్వంలోని మంజూరైన అన్ని పనులను రద్దు చేయడంతో దీనిలో బాగంగా డైవర్సన ఛానల్ నిర్మాణం అటుకెక్కింది. అయితే ఇప్పటికీ మరో అడుగు ముందుకు పడలేదు.నగరంలోని పలు ప్రధాన ప్రాంతాలు వర్షాలు కురిసి న ప్రతిసారీ ముంపునకు గురవుతున్నాయి. వాటిలో ప్రధానమైనవి మార్కెట్ యార్డ్ ఏరియా, శ్యామలా సెంటర్, కంబాల చెరువు, తుమ్మలావ, ఆర్యా పురం, ప్రభుత్వ కాలేజీ, రైల్వేస్టేషన్, వీఎల్‌పురం, బస్‌స్టాండ్ ప్రాంతంతో పాట ం, తాడితోట, హైటెక్ బస్‌స్టాండ్లు పూర్తిగా బ ారిన పడుత ున్నాయి. ఆయా ప్రాంతాల్లో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

# పార్టీ కేడర్ కంటే రఘురామకు ప్రాధాన్యమా....

## తమ్ముళ్లలో అంతర్మథనం

ఏలూరు, జూన్ 14, (న్యూస్ పల్స్) తెలుగుదేశం పార్టీ ఘనమైనది. నాలుగు పదుల వయసు కలిగినది. పార్టీకి చిత్తశుద్ధితో పనిచేసే కార్యకర్తలు ఉన్నారు. అలాగే నాయకులు ఎంతో మంది ఉన్నారు. కానీ ఇటీవల కాలంలో తెలుగుదేశం అధినాయకత్వం కొత్త పోకడలు పోతోంది. పార్టీలో ఉన్న వారి కంటే బయట వారికే అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ వారి సేవలో తరిస్తోంది. దానికి ఒక మత్తు డాక్టర్, మరో రఘురామ క్రిష్ణం రాజు ఉదాహరణలుగా చెప్పుకోవాలి. నిజానికి వీరికి పార్టీతో ఎలాంటి సంబంధం లేదు. కానీ వారిని భుజానికెత్తుకుని టీడీపీ చేస్తున్న రాజకీయ విన్యాసాలతో సొంత పార్టీలోనే కలి పుట్టిస్తోంది.విశాఖలో చూస్తే చంద్రబాబు లోకేష్ అంటే ప్రాణం పెట్టే క్యాడర్ ఉంది. వారిలో చాలా మంది ఈ మధ్య కరోనా కాటుకు బలి అయిపోయారు. వానపల్లి రవికుమార్ అని కొత్తగా టీడీపీ కార్పోరేటర్ గా నెగ్గిన ఆయన కరోనా తో అసువులు బాశారు. ఆయన చంద్రబాబు మీద ఈగ వాలనిచ్చేవారు కాదు. అలా ఎంతో మంది సీనియర్ నేతలు కరోనా దెబ్బకు ఈ లోకాన్ని వీడారు. ఇక సడెన్ గా విశాఖ టూర్ పెట్టుకున్న లోకేష్ మత్తు డాక్టర్ సుధాకర్ కుటుంబాన్ని మాత్రమే పరామర్శించి వెళ్ళిపోయారు. మత్తు డాక్టర్ ది సహజ మరణమే. ఆయన గుండె నొప్పితో మృతి చెందారు. కానీ ఆయన దళితుడు, గత ఏడాది జగన్ సర్కార్ మీద విమర్శలు చేశారు. కాబట్టి కుల రాజకీయం చేయడానికి లోకేష్ విశాఖ వచ్చారని వైసీపీ ఎమ్మెల్యే గుడివాడ అమరనాధ్ అంటున్నారు. లోకేష్ కి శవ రాజకీయాలు చేయడమే చేతనవునని, అందుకే చనిపోయిన టీడీపీ నేతల కుటుంబాలను పరామర్శించలేదు అని గుడివాడ గట్టిగానే విమర్శించారు.ఇక వైసీపీకి చెందిన ఎంపీ రఘురామ క్రిష్ణం రాజు విషయంలో కూడా చంద్రబాబు అతి చేశారు అన్న మాట ఉంది. ఆయన పక్షాన నిలిచి కేంద్ర హోం శాఖకు కూడా లేఖలు సంధించారు. అనుకూల మీడియా ద్వారా దన్నుగా నిలిచారు. అదే టైమ్ లో టీడీపీ తరఫున ఎంతో మంది అరెస్ట్ అయ్యారు. ఇక దూలిపాళ్ళ నరేంద్ర కుమార్ వంటి వారు అయితే నెల రోజుల పాటు రిమాండ్ ఖైదీగా ఉన్నారు. వీరెవరి విషయంలో చూపించని శ్రద్దాసక్తులు ఒక్క రఘురామ విషయంలో మాత్రం చంద్రబాబు చూపించి సొంత పార్టీ వారి చేత కూడా ఆక్షేపణలకు గురి అవుతున్నారని అంటున్నారు. అసలు టీడీపీకి నేతలు లేరా. వారికి కష్టాలు లేవా అన్న ప్రశ్న కూడా ఈ సందర్భంగా ఉదయిస్తోంది.ఫస్ట్ సొంత పార్టీని చక్కదిద్దుకోవాలి. క్యాడర్ కి ధైర్యం ఇవ్వాలి. వారిని ముందుకు నడిపించాలి. ఇది కదా ఏ నాయకుడు అయినా ప్రతి;పక్షాన ఉన్నపుడు చేయాల్సిన పని. కానీ ఎన్నికల్లో పాలుపంచుకోవద్దు అని జిల్లా పరిషత్ ఎన్నికల వేళ బహిష్కరణ పిలుపు ఇచ్చి పిరికి మందు నూరిపోసేది టీడీపీ అధినాయకత్వమే. అసెంబ్లీకి పోవద్దు అని గెలిచిన ఎమ్మెల్యేలను కట్టడి చేసేది వారే. పోనీ టీడీపీ నేతలకు వేరే ఏదైనా దిశా నిర్దేశం చేస్తున్నారా అంటే అదీ లేదు. ఎంతసేపూ జగన్ని ఎలా ఇబ్బంది పెట్టాలి అన్న దాని మీద దృష్టి పెట్టి బయట వారికే టీడీపీ శక్తియుక్తులు అన్నీ ధారపోస్తున్నారు అన్న భావన అయితే సొంత పార్టీలో కనిపిస్తోంది. మరి ఇప్పటికైనా టీడీపీ మా కోసం ఉంది అన్న నిబ్బరం క్యాడర్ లో పెంపొందించేలా చర్యలు తీసుకోకపోతే మాత్రం టీడీపీ ఫర్ అవుట్ సోర్సింగ్ అనేసుకోవచ్చేమో.

# కౌలు కోసం ఎదురుచూపులు

విజయవాడ, జూన్ 14, (న్యూస్ పల్స్) రాజధాని పరిధిలో రైతులకు ఇవ్వాల్సిన కౌలు విషయంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం ప్రదర్శిస్తోంది. ఏప్రిల్ నెలలో నిధులు విడుదల చేసి ఇవ్వాల్సిన వార్షిక కౌలు ఇప్పటికీ చెల్లించలేదు. పెద్ద రైతులకు ఇబ్బంది లేకపోయినప్పటికీ చిన్న రైతులు మాత్రం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 28 వేల మంది రైతులు భూములిచ్చినట్లు రికార్డుల్లో ఉంటే వీరిలో 22 వేల మంది చిన్నా చితక రైతులే కావడం విశేషం. వారందరూ ఏడాది కౌలు మీదే ఆధారపడ్డారు. 34,399 ఎకరాలకు సంబంధించి ఏడాదికి రూ.196 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇప్పటి వరకూ ఆరేళ్ళ కౌలు చెల్లించారు. ఏడో ఏడాది చెల్లింపులకు సంబంధించి నిధులు రాలేదని అధికారులు చెబుతున్నారు. దీనిపై ఇటీవల రైతులు ఆందోళనకు దిగారు. ఎఎంఆర్‌డిఎ కార్యాలయాన్ని ముట్టడించేందుకు బయలు దేరారు. వారిని పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం కొంతమంది మహిళా రైతులు విజయవాడలోని ప్రధాన కార్యాలయంలో అధికారులను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సమయంలో అధికారులు మాట్లాడుతూ నిధులు కేటాయింపు జరిపినా విడుదల కాలేదని తెలిపారు. దీనిపై రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒకవైపు రాజధానిని ముందుకు కదలనీయడం లేదని, కనీసం ఇవ్వాల్సిన కౌలు డబ్బులైనా ఇప్పించాలని కోరారు. నిధులు రాగానే వెంటనే బ్యాంకుల్లో జమ చేస్తామని అధికారులు తెలిపారు. దీనిపై రైతులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ప్రభుత్వం కావాలనే రైతులను ఇబ్బంది పెట్టేందుకు ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాజధాని పరిధిలో రైతుల కుటుంబాల్లో చాలామంది కోవిడ్ బారినపడి చికిత్సలు చేయించుకోవాల్సి వచ్చిందని, అటు వంటి వారికి కౌలు డబ్బులు ఆదుకుంటాయ నుకుంటే సమయానికి పడలేదని, దీనివల్ల ఇబ్బందులు ఎదుర్కో వాల్సి వచ్చిందని చెబుతున్నారు. డబ్బులొస్తా యనే ఉద్దేశంతో అప్పులు చేసి చికిత్సలు చేయించుకు న్నామని, ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని చెబుతున్నారు. వెంటనే డబ్బులు చెల్లించాలని వారు కోరుతున్నారు. దీనిపై వెలగపూడి రైతు భాను మాట్లా డుతూ సమయానికి డబ్బులు చెల్లిస్తే కొంతమందికి ఇబ్బందులు తప్పుతాయని తెలిపారు. అందరూ పెద్దరైతులు లేరని, చాలామంది చిన్నరైతులే ఉన్నారని, వారికి ఈ ఆదాయం తప్ప మరొకటి లేదని తెలిపారు. ఒకరిద్దరు పెద్దరైతులు ఉంటే వారిని చూపించి అందరికీ లక్షల్లో ఆదాయం ఉందనే విధంగా మాట్లాడటం సరికాదని తెలిపారు. ఆర్థిక సంవత్సరం పూర్తయిన వెంటనే కౌలు చెల్లించాల్సి ఉందని, ఆలస్యం అయ్యేకొద్దీ వడ్డీలకు తెచ్చుకుని తినాల్సి వస్తోందని వివరించారు.

# జగన్ కు తగ్గని క్రేజ్

విజయవాడ, జూన్ 14, (న్యూస్ పల్స్)ఏపీ ప్రజలు ప్రతిపక్షాలను పట్టించుకోవడం లేదా ? ప్రభుత్వంపై సానుభూతి కోణంలోనే ఉన్నారా ? అంటే.. ఔననే అంటోంది.. డెమొక్రటిక్ రిఫార్మ్స్ సర్వే..! జగన్ సర్కారు రెండేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈ సంస్థ సర్వే చేసింది. జగన్ పాలనపై ప్రజలు ఏమనుకుంటున్నారు? ప్రతి పక్షాలు పుంజుకున్నాయా? అనే కోణంలో ఈ సర్వే సాగినట్టు రిఫార్మ్స్ సర్వే పేర్కొంది. ఇంకా తుది ఫలితాలు ఇంకా రానప్పటికీ.. ప్రస్తుతానికి ఉన్న అంచనాల ప్రకారం.. జగన్



సర్కారుకు గ్రామీణ ప్రాంత ప్రజల నుంచి పట్టణ, నగరాల్లోని పేద, దిగువ మధ్య తరగతి వర్గం సానుకూలంగా ఉన్నట్టు పేర్కొంది.జగన్ అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు.. అటు గ్రామీణ, ఇటు నగరాలు, పట్టణాలలోని ప్రజలకు లబ్ధి చేకూరుస్తున్నాయని పేర్కొంది. అమ్మ ఒడి, చేయూత, ఇంటింటికే రేషన్, ఇంటింటికీ ఫించన్ వంటి పథకాలు హైలెట్‌గా నిలుస్తున్నాయని తెలిపింది. ప్రస్తుతం తమ సర్వే కొనసాగుతోందని సంస్థ పేర్కొంది. అదేసమయంలో మూడు రాజధానులపై సగం మంది ప్రజలు సానుకూలంగా ఉన్నట్టు తెలిపింది. ఇక్కడ ఆశ్చర్యకర విషయం ఏంటంటే.. ఎన్నికలు జరిగి, వైసీపీ సర్కారు ఏర్పడి రెండేళ్లు పూర్తయినా ప్రధాన ప్రతిపక్షాలుగా ఉన్న టీడీపీ, జనసేన, వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీలు.. ఎక్కడా పుంజుకోలేదని స్పష్టం చేసింది.సర్వేలో పాల్గొన్న వారిలో జనసేన అధినేత పేరు చెబుతున్నా.. ఇతర నాయకుల పేర్లు కానీ, పార్టీ ప్రధాన కార్యాలయం ఎక్కడుంది ? అనే ప్రశ్నకు కానీ సమాధానం చెప్పలేక పోతున్నారని సర్వే వెల్లడించింది. అదేసమయంలో టీడీపీ అధినేతగా చంద్రబాబును మాత్రమే అంగీకరిస్తామని.. మెజారిటీ ప్రజలు చెప్పడం గమనార్హం. లోకేష్ సహా బాలయ్యను కీలక నేతలుగా ఎక్కువ మంది గుర్తించలేదని..

# 2024 ప్రణాళికలు రెడీ

విజయవాడ, జూన్ 14, (న్యూస్ పల్స్)వును ఒకసారి కొడితే బిగ్ సౌండ్ వచ్చింది కానీ నో యూజ్ అన్నట్లుగానే సీన్ ఉందిట. అదే వైసీపీ వర్సెస్ టీడీపీ వార్ లో ఫ్యాన్ పార్టీ వారు తరచూ మదన పడుతున్న విషయం ఇది. అంటే తొలి దెబ్బతో టీడీపీ ఇంకా దారికి రాలేదని, పైగా తమ తోవకు అడ్డుగా ఉందని వైసీపీ నేతలు గుస్సా అవుతున్నారు. టీడీపీ నాయకులు ప్రతీ దానికీ విమర్శలు చేయడం, అభివృద్ధిని అడ్డుకోవడం వంటివి తట్టుకోలేకపోతున్నామని కూడా అంటున్నారు. మరి దీనికి పరిష్కారం ఏంటి అంటే మళ్ళీ జనమే చూపించాలని కూడా వారు అంటున్నారు. తొలిసారి ఇచ్చిన స్ట్రాంగ్ డోస్ సరిపోవడంలేదు. 2024 ఎన్నికల్లో ఇంకా గట్టిగా దెబ్బ కొట్టాల్సిందే అంటున్నారు వైసీపీ మంత్రులుఈ మాట అన్నది ఎవరో కాదు అలుగుటయే ఎరుగని అజాత శత్రువు అన్న మాటకు అచ్చం సరిపోయే ఉప ముఖ్య మంత్రి ధర్మాన క్రిష్ణ దాస్. టీడీపీకి జనాలే మళ్ళీ గుణపాఠం చెప్పాలి అంటూ ఆయన తాజాగా అంటున్నారు. మాకు జనాలు అధికారం ఇచ్చారు. మేము ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, అయినా కూడా బురద జల్లుతూ మాకు అడ్డుతగులుతున్న టీడీపీ సంగతిని జనమే చూసుకోవాలని కూడా ఆయన పిలుపు ఇచ్చారు. ప్రజలు ఈసారి టీడీపీకి చావు దెబ్బ తీయాలని, తీస్తారని కూడా ధర్మాన జోస్యం చెప్పేశారు. ఈసారి ఎన్నికలే టీడీపీకి చివరివి అవుతాయని కూడా ఆయన అంటున్నారు.ప్రజలు వైసీపీని మెచ్చి 2019 ఎన్నికల్లో 151 సీట్లను కట్టబెట్టారు. కేవలం 23 సీట్లను మాత్రమే టీడీపీకి ఇచ్చారు. అయినా కూడా టీడీపీ ఎక్కడా తగ్గడంలేదు. అడుగడుగునా వైసీపీ దూకుడుకు బ్రేకులు వేస్తోంది. దాన్ని అనుభవమని తమ్ముళ్లు గర్వంగా చెప్పుకుంటే అడ్డదారులు అని వైసీపీ ఎకసెక్కం చేస్తోంది. వ్యవస్థలను అడ్డం పెట్టుకుని టీడీపీ బరితెగించి చేస్తున్న ఈ విన్యాసాలను జనం గమనిస్తున్నారని మంత్రులు అంటున్నారు. పేదల నోటి కాడ కూడు లాగేసుకునే రాజకీయానికి వారే స్వస్తివాచకం పలుకుతారు అంటున్నారు. అలా టీడీపీని నిలువరించడం మా వల్ల కావడం లేదని ఇండైరెక్ట్ గా మంత్రులు ఒప్పేసుకుంటున్నారు. మళ్ళీ జనమే ఓడించి తమకు మరోమారు అధికారాన్ని ఇవ్వాలని కూడా మూడేళ్లకు ముందే అప్పీల్ చేసుకుంటున్నారు.తెలుగుదేశం పార్టీకి నిజానికి 2019 ఎన్నికలే చివరి ఎన్నికలు అని వైసీపీ నాడు ఊదరగొట్టింది. దానికి తగినట్లుగానే జనం కూడా ఏకంగా ఘోర పరాజయమే పసుపు పార్టీకి రుచి చూపించారు. చంద్రబాబు ప్లేస్ లో ఎవరు ఉన్నా ఈ పాటికి దుకాణం సర్దేసేవారే. కానీ బాబు మాత్రం ఓటమిని అసలు అంగీకరించని మనస్తత్వం కావడంతో గత రెండేళ్ళూ వైసీపీ పాలకులకు హాయిగా నిద్ర పోయే రోజూ ఒక్కటీ లేకుండా చేశారు అంటున్నారు. దాంతో మరో మూడేళ్ళు అధికారం చేతిలో ఉండగానే వైసీపీకి మండుకొస్తోంది. ఇన్ని సీట్లు ఇంత అధికారం ఉన్నా కూడా టీడీపీ వ్యూహాలను ఏమీ చేయలేకపోతున్నామని తెగ బాధపడుతున్నారు. అందుకే మళ్ళీ మళ్లీ టీడీపీని జనాలు ఓడించాలని అంటున్నారు. మరి ఒక అయిదేళ్ల పాలన తరువాత ఏ సర్కార్ మీద అయినా ఎంతో కొంత వ్యతిరేకత వస్తుంది. ఆ మేరకు విపక్షం కూడా పుంజుకుంటుంది. ఇపుడున్న స్థితిలో చూస్తే జగన్ కి మరో మారు అధికారం దక్కడం ఖాయమే కానీ ఇన్ని సీట్లు దక్కుతాయన్న అన్నదే డౌట్. అదే సమయంలో టీడీపీకి 23 సీట్లకు బదులు రేపు ఏ 46 సీట్లో వస్తే వైసీపీ పాలకుల సంగతేంటి అన్న చర్చ కూడా ఉంది. మొత్తానికి ధీటుగా వ్యూహాలను ఎదుర్కొనే నైపుణ్యం వైసీపీ ఇప్పటికైనా సంపాదించాలన్న సూచన మాత్రం అన్ని వైపులా వినిపిస్తోంది.

# ఎవరికి పట్టని రాజధాని రైతులు

విజయవాడ, జూన్ 14, (న్యూస్ పల్స్) రాజధాని రైతులు ఆందోళన ఆగలేదు. ఇంకా కొనసాగుతూనే ఉంది. అయితే రాజధాని అమరావతి రైతుల ఆందోళనలను మాత్రం ప్రభుత్వ పట్టించుకోవడం లేదు. పైగా మూడు రాజధానులు ఖాయమంటూ ప్రకటనలు చేయడం రాజధాని రైతుల్లో మరింత ఆందోళన పెంచేదిగా ఉంది. రాజధానిని అమరావతిలోనే కొనసాగించాంటూ రైతులు చేస్తున్న ఉద్యమం దాదాపు 600 రోజులకు చేరుకుంది. అయినా ప్రభుత్వం మాత్రం వీరిని ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.ఇక రాజధాని రైతులను అన్ని పార్టీలూ పూర్తిగా వదిలేశాయనే చెప్పాలి. రాజధాని అమరావతి రైతులు ఆందోళన ప్రారంభించిన తొలినాళ్లలో వైసీపీ తప్ప అన్ని పార్టీలు మద్దతు పలికాయి. ప్రధానంగా అప్పట్లో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ పూర్తిగా రాజధాని రైతుల ఆందోళనకు మద్దతు ప్రకటించింది. చంద్రబాబు రైతుల ఆందోళన కోసం జోలె కూడా పట్టారు. బస్సు యాత్ర రాష్ట్ర వ్యాప్తంగా చెపట్టాలనుకున్నా కరోనా కారణంగా అది సాధ్యం కాలేదు.ఇప్పుడు తెలుగుదేశం పార్టీ కూడా పెద్దగా రాజధాని రైతుల ఆందోళనలను పట్టించుకోవడం లేదు. గతంలో చంద్రబాబు, లోకేష్, భువనేశ్వరి వంటి వారు ఆందోళనకు మద్దతు తెలుపుతూ తరచూ ఇక్కడ పర్యటించేవారు. కానీ గత కొన్నాళ్లుగా రాజధాని రైతుల మద్దతుగా వారు ఇక్కడకు రాలేదు. ఆందోళన 500 రోజులకు చేరిన సందర్భంగా చంద్రబాబు జూమ్ యాప్ లో మాట్లాడటం తప్ప తర్వాత వారికి మద్దతుగా నిలవలేదన్న వ్యాఖ్యలు విన్పిస్తున్నాయి.ఇక తొలినాళ్లలో బీజేపీ, జనసేన కూడా రాజధాని రైతులకు మద్దతు ప్రకటించాయి. కానీ కాలక్రమేణా ఆ పార్టీలు కూడా ఈ ఆందోళనకు దూరమయినట్లే కన్పిస్తుంది. దీంతో రాజధాని రైతులు పార్టీల వ్యవహారశైలిపట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికలు జరిగిన తర్వాత పార్టీల వైఖరిలో మార్పు వచ్చిందని రాజధాని రైతులు చెబుతున్నారు. అనుకూల మీడియా కూడా పెద్దగా పట్టించుకోవడం లేదు. తాము పార్టీల మీద కాకుండా న్యాయస్థానాలపైనే ఆశపెట్టుకున్నామని వారంటున్నారు. మొత్తం మీద రాజధాని రైతులకు దాదాపు అన్ని పార్టీలు హ్యాండ్ ఇచ్చాయనే చెప్పాలి.

# కంటతడి పెడుతున్న అన్నదాతలు..

## భూముల సర్వే చేయాలంటే లంచం ఇవ్వాల్సిందే....

## వీఆర్వో ను బదిలీ చేసి మా గ్రామానికి నూతన వీఆర్వోకు బాధ్యతలు ఇవ్వాలని రైతులు డిమాండ్...

కౌతాళం జూన్ 14, (న్యూస్ పల్స్)మండల పరిధిలోని నదిచాగి గ్రామంలోని భూములను సర్వే చేయాలంటే అధికారి రెవిన్యూ వీఆర్వో కు అంతో ఇంతో ఇస్తేనే సర్వే చేస్తాం. లేకుంటే లేదని తెగేసి చెప్తున్న ఆ గ్రామ రెవిన్యూ అధికారి. అన్నదాతలు విసుగుచెందుతున్నారు, భూముల సర్వే చేసేందుకు డీడీ తీసిన తరువాత భూముల సర్వే చేసేందుకు వీఆర్వో కు సర్వేయర్ కు మామూళ్లు ఇస్తేనే సర్వే చేసేందుకు దిగుతారు లేకుంటే పెండింగులో ఉంచుతారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిగారు ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామ స్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలును పారదర్శకంగా అందించేలా గ్రామ సచివాలయలను నిర్మిచి నెలకొల్పింది. రైతన్నలకు ప్రజలుకు అన్నివర్గాల వారికి అందుబాటులో ఉండేలా సచివాలయం సిబ్బంది నియామకాలను చేపట్టింది. కానీ అందులో పనిచేసే కొందరు సిబ్బంది లంచాలకు పాలుపడ్డారు మామూళ్లు పర్వనికి తెరదించుతున్నారు ప్రభుత్వ ఆశయానికి గండి కొడుత్తన్నారు. విఆర్వో రామాంజనేయులు, సర్వేయర్ శ్రీదేవి భూ సర్వే పేరుతో రైతుల నుంచి మామూళ్లు వసూళ్లకు పాల్పడుతున్నారు. రైతుల వద్ద నుంచి రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకు మముళ్ళను వాసులు చేసిన తర్వాతనే భూములను సర్వే చేసేందుకు ముందుకొస్తున్నారు అన్న ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఇటీవల గ్రామంలో పలువురు రైతులు భూములను సర్వే చేయించుకోగా ఒక్కొక్క రైతునుంచి రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకు పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. డబ్బులు ఇస్తేనే మీ పొలాలను సర్వే చేస్తామని సచివాలయం సర్వేయర్, వీఆర్వో తెగేసి చెబుతుండడంతో. రైతులు చేసేదేమీ లేక డబ్బులు ఇచ్చి పనులు చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామంలో లంచావతారమెత్తిన సదరు విఆర్వో, సర్వేయర్ పై జిల్లా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోని మా గ్రామానికి కొత్త వీఆర్వో కు బాధ్యతలు ఇవ్వాలని రైతులు కోరుతూ ఆవేదన వ్యక్తం చేశారు...

# ఘనంగా రామ్ చరణ్ పెళ్లి రోజు వేడుకలు

ఎమ్మిగనూరు జూన్ 14, (న్యూస్ పల్స్)పట్టణంలో తాలూకా అధ్యక్షులు రాహుల్ సాగర్ రాష్ట్ర రామ్ చరణ్ యువశక్తి పిలుపుమేరకు ఎమ్మిగనూరు తాలూకా మెగా ఫ్యాన్స్ సేవాసమితి ఆధ్వర్యంలో స్థానిక రామస్వామి గుడి నందు పూజా కార్యక్రమం తో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మరియు ఉపాసన గారి 9వ పెళ్లిరోజు వేడుకలు నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా అధ్యక్షులు రాహుల్ సాగర్ కార్యదర్శి భరత్ సాగర్ లు మాట్లాడుతూ సమాజ సేవ కి ప్రతిరూపం మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మరియు ఉపాసన గారిని తమ ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలిచిన జంట రామ్ చరణ్ మరియు ఉపాసన గారు అని కొనియాడారు ఈ జంట రాబోయే రోజుల్లో మరెన్నో పెండ్లి రోజు వేడుకలు చేసుకుంటూ సేవా కార్యక్రమాలతో ముందుకు వెళ్లాలని శ్రీరాముడు దేవుణ్ణి ప్రార్థిస్తున్నాం అని తెలియజేశారు

# అక్రమ మద్యం విక్రయ లావాదేవీల్లో తలెత్తిన వివాదం

## యువకుడికి నిప్పంటించిన వైనం

కడప మద్యం సీసాలు మాయం చేశాడని అతడిపై పెట్రోల్ పోసి నిప్పంటించిని దారుణ ఘటన ఇది. కడప జిల్లా మైదుకూరు మండలం వనిపెంట గ్రామంలో . అక్రమ మద్యం విక్రయ లావాదేవీల్లో తలెత్తిన వివాదాల కారణంగా యంగోళ్ళ నాని అనే యువకుడి పై పెట్రోల్ పోసి నిప్పంటించారు. నిందితులు కటారి రాజు, కొంతమంది యువకులుగా పోలీసులు గుర్తించారు. ఆదివారం రాత్రి సమయంలో అందరూ చూస్తుండగానే పెట్రోల్ పోసి నిప్పంటించి దారుణానికి ఒడిగట్టారు. స్థానికుల సహాయంతో బాధితుడిని కడప రిమ్స్ కు తరలించారు.

# కాపు కాసేది ఎవరికి...

కాకినాడ, జూన్ 14, (న్యూస్ పల్స్) విభజన ఏపీలో అతి పెద్ద సామాజిక వర్గంగా ఉన్న కాపులు మరోమారు కీలకం కానున్నారా. మూడేళ్ళ తరువాత జరగనున్న ఎన్నికల్లో వారే చక్రం తిప్పనున్నారా అంటే సమాధానం అవును అనే వస్తోంది. ఉమ్మడి ఏపీ రెండు అయ్యాక పదమూడు జిల్లాల రాష్ట్రంలో కాపులే పెద్ద జనాభాగా ఉన్నారు. మొత్తం 175 అసెంబ్లీ సీట్లు ఉంటే అందులో మూడవ వంతు కాపులు ప్రభావం చేయగలరు అన్న చర్చ ఉంది. ఇక ఉభయగోదావరి జిల్లాలోనే ముప్పయి దాకా సీట్లు ఉన్నాయి. ఈ క్రమంలో 2014 ఎన్నికల్లో తెలుగుదేశానికి, 2019 ఎన్నికలలో వైసీపీని మద్దతు ఇచ్చిన కాపులు వచ్చే ఎన్నికల్లో ఏ రూట్ కు టర్న్ అవుతారు అన్నదే ప్రశ్నగా ఉంది.చంద్రబాబు కాపులను బీసీలలో చేరుస్తామని చెప్పి వంచించారు. ఆయన చేతిలో లేని దాన్ని హామీగా ఇచ్చి అధికారం అందుకున్నారు. కానీ కాపులకు మాత్రం ఆయన అన్యాయం చేశాడు అన్న ఆక్రోశం ఉంది. అది చివరికి 2019 ఎన్నికల నాటికి వైసీపీకి వరంగా మారింది. అయితే వైసీపీ కాపులకు ఈ హామీ ఇవ్వలేదు, పైగా తమ వల్ల కాదు అంది. కానీ దానికి బదులుగా ఏటా రెండు వేల కోట్ల నిధులు కాపుల అభివృద్ధికి కేటాయిస్తామని భారీ హామీ జగన్ ఇచ్చారు. అలా అయిదేళ్ళలో పదివేల కోట్లు ఇస్తామని కూడా ఆయన చెప్పారు. ఇప్పటికి రెండేళ్ళ పాలన పూర్తి చేసుకుని మూడవ ఏట అడుగు పెట్టిన వైసీపీ కాపులకు నాలుగు వేల కోట్లు బాకీ పడిదని ఆ సామాజికవర్గం మండిపడుతోంది.కాపుల సెగ ఏంటో చంద్రబాబు స్వయంగా చవిచూశారు. ఇపుడు రెండేళ్ల తరువాత మెల్లగా జగన్ కి ఆ సెగ తగులుతోంది అంటున్నారు. కాపు యువత సోషల్ మీడియాలో అయితే జగన్ సర్కార్ మీద పెద్ద ఎత్తున విరుచుకుపడుతోంది. కాపు కార్పోరేషన్ పెట్టారు కానీ లాభం ఏంటి. ఎవరికి రుణాలు ఇస్తున్నారు. ఎవరికి ఆర్ధిక ఆసరా లభిస్తోంది అంటూ వారు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. కాపు కార్పోరేషన్ చైర్మన్ జక్కంపూడి రాజా మీద కూడా వారు హాట్ కామెంట్స్ చేస్తున్నారు. ఏమీ చేయలేని వారికి పదవులు ఎందుకు అంటూ మండిపడుతున్నారు. కాపులకు తక్షణం నాలుగు వేల కోట్లు రిలీజ్ చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని కూడా డిమాండ్ చేస్తున్నారు.అటు తెలుగుదేశాన్ని, ఇటు వైసీపీని చూసిన కాపులు ఈసారి జనసేన కొమ్ము కాస్తారా అన్న మాట కూడా ఉందిపుడు. పైగా కాపులు గత రెండు ఎన్నికల్లో పోలరైజ్ కాలేదు. ఈసారి మాత్రం సంఘటితం కావాలి అనుకుంటున్నారుట. రెండు పార్టీలనూ చూశాం, ఈసారి తమ కులం నాయకుడి పార్టీకి మద్దతు ఇస్తే తప్పేంటి అన్న చర్చ అయితే యువతలో మెల్లగా వస్తోందిట. అయితే మధ్య వయసు వారు, పెద్దలు మాత్రం ఇంకా డోలాయమానంలో ఉన్నారు. ఏది ఏమైనా జగన్ సంక్షేమ పధకాలను నేరుగా లబ్దిదారుల ఖాతాలో వేస్తూ కుల కార్పోరేషన్లను ఉత్సవ విగ్రహాలుగా మార్చేశారు అన్న మిర్శ అయితే ఉంది. అది కేవలం కాపులకే కాదు బ్రాహ్మణ కార్పోరేషన్ తీరు కూడా అలాగే ఉంది. మొత్తం మీద చూసుకుంటే కాపులు ఫేస్ టర్నింగ్ ఇచ్చుకుంటే గోదావరి జిల్లాల రాజకీయం మారిపోతుంది అంటున్నారు. అయితే జగన్ బీసీల జపం చేస్తున్నందువల్ల కాపులు సైడ్ అయినా వారు అండగా ఉంటారు కాబట్టి ఒడ్డున పడిపోవచ్చు అన్న పొలిటికల్ లెక్కలేవో వైసీపీ పెద్దలకు ఉన్నాయని అంటున్నారు. మొత్తానికి కాపులు జగన్ని నమ్మడం లేదని విపక్షం అంటూంటే జగన్ కూడా వారి మీదనే పూర్తిగా ఆధారపడకుండా కొత్త రాజకీయాలు చేస్తున్నారు అన్న మాట ఉంది.

# ఆ భేటీల వెనుక రాజకీయాలు లేవు



అమరావతి జూన్ 14, (న్యూస్ పల్స్)బంధుత్వం,మిత్రుత్వం ఉంటే పార్టీ జనరల్ సెక్రటరీ నడ్డాని కలవాలి. సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రధానమంత్రిని ,కేంద్ర మంత్రులని కలవడం వెనుక ఎటువంటి రాజకీయం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు అన్నారు. మన స్టేట్ బడ్జెట్ కంటే వ్యవసాయ ఆర్థిక రుణ ప్రణాళిక ఎక్కువ ఉంది. చంద్రబాబు సమయంలో వ్యవస్థల పట్ల విశ్వాసం సన్నగిల్లింది. ఇప్పుడు మీ ప్రభుత్వంలో వ్యవస్థల పట్ల ఏ విధమైన అవగాహన ఉంది. పెద్ద ఎత్తున ధాన్యం కొంటా అన్నారు. ఎక్కడ కొన్నారు. 1400 రూపాయలకి ధాన్యం కొనిపించలేని చేతగాని ప్రభుత్వమని అన్నారు.రైతు భరోసా కేంద్రాలలో రైతుని ఆదుకునే దిక్కు లేదు. మీరు మిల్లర్లు చేతిలో కీలు బొమ్మలుగా మారారు. మీరు రెండు నెలలకి కూడా డబ్బు ఇవ్వని కారణంగా మిల్లర్లకి అమ్ముకుంటున్నారు. సివిల్ సప్లైస్ డిపార్ట్మెంట్ లో డీఎంలు ఎంత కాలం నుంచి ఉంటున్నారు. ఒక్క సివిల్ సప్లైస్ లోనే ఇంత వైఫల్యం ఉంటే ప్రభుత్వం ఏం పరిపాలన చేస్తుందని అన్నారు. సీఎం జగన్మోహన్ రెడ్డి 30 లక్షల ఇల్లు ఇస్తున్నారు. ఇందులో అవినీతి జరిగింది.. చాలా చోట్ల పెద్ద ఎత్తున రేటు పెట్టి కొన్నారు. సరే ఇందులో 15 లక్షల ఇళ్ళకి 1 లక్ష యాభై వేల చొప్పున కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చింది. రోడ్లకి ఎన్ఆర్ఈజీఎస్ బ ఫండ్స్ ఇస్తే తమలపాకు రోడ్లు వేశారు. ఇళ్ళకి 23 లక్షల కోట్లు ఇస్తే..ఇంకా ఇవ్వమంటున్నారు. మోడీ వ్యాక్సిన్లు వేయాలి,ఇల్లు కట్టాలి మరి మీరేం చేస్తారని అయన ప్రశ్నించారు.ఇసుక దోపిడీ పెద్ద ఎత్తున జరుగుతుంది. ప్రభుత్వం దోపిడీని స్ట్రక్చరైజ్ చేసింది.దీని ముందు చంద్రబాబు పని చేయడు. మోడీ ఇస్తున్న పథకాలకు కూడా జగనన్న పేరే. ప్రభుత్వం చేస్తున్న అన్ని పనుల్ని బీజేపీ గమనిస్తుంది. మీరు స్థలం ఇస్తున్నారు..కేంద్రం లక్షన్నర ఇస్తుంది..మీరొక లక్ష ఇవ్వండి..ఇసుక ఫ్రీగా ఇవ్వండి..సిమెంట్ తగ్గించి ఇవ్వండి. మీరు మధ్యలో రావద్దు..పేదవాడు చక్కగా ఇల్లు కట్టుకుంటాడని అన్నారు.డబ్బంతా మేమిస్తే మీరు ఏం చేస్తారు..మీరు ఎన్నికయింది దేనికి. కేంద్ర ప్రభుత్వం పేదవారికి చేస్తున్న కార్యక్రమాలు మీరు చేయడం లేదు. సంక్షేమానికి అప్పు చేస్తున్న మీరు అభివృద్ధికి ఎందుకు అప్పు చేయరు. మోడీ అప్పు చేసింది.. రాష్ట్రాలలో అభివృద్ధిని చేయడం కోసమని అయన అన్నారు.

# దళిత మహిళా ఉద్యోగిపై దాడి హేయనీయం

## ఐహెచ్ఆర్ఏ స్టేట్ సివిల్ రైట్స్ చైర్మన్ కరణం తిరుపతినాయుడు

గుంటూరు జూన్ 14 ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములో దళితులు అణగారిన వర్గాలపై అధికార పక్షానికి చెందిన వారు దాడులకు పాల్పడం పరిపాటిగా మారిందని అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం స్టేట్ సివిల్ రైట్స్ చైర్మన్ కరణం తిరుపతినాయుడు పేర్కొన్నారు.గుంటూరు దుర్గి మండలం అడిగొప్పల గ్రామంలో నెల 11 న రామన బోయిన పవిత్ర తన ఇంటి ప్రక్కన గల ఖాలీ స్థలాన్ని కొందరు ఖబ్జా చేయడం తో వెళ్లి అడిగినందుకు దళిత మహిళ పై దాడి కి పాల్పడటం హేయనీయమన్నారు.ఇట్టి విషయమై ఈ నెల 13 న ఆంధ్రప్రదేశ్ అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం స్టేట్ సివిల్ రైట్స్ చైర్మన్ కరణం తిరుపతినాయుడు జిల్లా చైర్మన్ పులిమిల సత్యం జిల్లా కమిటీ మెంబర్ పి.రాము బృందం తో కూడిన నిజనిద్దారాణ కమిటీ వెళ్లి పూర్వాపరాలను పరిశిలించినట్లు తిరుపతి నాయుడు తెలిపారు. అడిగొప్పల గ్రామంలో గుట్ట మీద సెంటరు వద్ద 03 సెంట్లు భూమిలో ఒక సెంటు లో ఇల్లును నిర్మించుకున్నారని మిగత స్థలాన్ని లోకల్ పార్టీ నాయకులు కబ్జా చేయాలని దురద్దేశంతో మహిళ అని కూడా చూడకుండా ఆమె పై దాడి చేసి నడి రోడ్డులో ఆమె జాకెటు చింపి మానవ విలువలను మంట కలిపి నారని పేర్కొన్నారు.ఒక దళిత మహిళ పై దాడి జరుగడం నిజమేనని నిజ నరి?దారణ కమిటీ నివేదికలో వెల్లడైనట్లు తెలిపారు.. ఈ క్రమములోవారు విలేకర్లు తో మాట్లాడుతూ సంఘటన జరిగిన స్థలం నుండి బాధితురాలు 100 నెంబరుకు పోన్ చేసినప్పటికి సంఘటనా స్థలానికి పోలీస్ సిబ్బంది. రాకపోవటం అనేది విచారించ జరిగిన విషయము నాలి శ్రీను, నాళి.రామయ్య, కందుకూరి , వెంకయ్య వీరు అదికార పార్టి నాయకులు మరియు సభ్యులు అయినందున పోలీసులు సాటి మహిళలోకం అన్యాయం జరిగినప్పటికి పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి రాకపోవటం అధికార దుర్వినియోగం అని ఇది పూర్తిగా రాజ్యాంగా ప్రాధమిక హక్కులకు విరుద్ధం అని ప్రమాదకరమన్నారు. సాటి మహిళ అడిగొప్పల గ్రామంలో సచివాలయం-2 లో ఎ.ఎన్.యం. గా విదులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి వారిపై సి.ఐ. రూరర్ మాచర్ల భక్త వత్సల రెడ్డి దుర్గి ఇన్ చార్జి ఎస్.ఐ. ఉదయ లక్ష్మి ఎలాంటి చర్య తీసుకోక పోవడం శోచనీయమని వారు పేర్కొన్నారు. ఈ విషయంను గుంటూరు జిల్లా రూరల్ సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్.పి) వారికి మరియు జాతీయ మానవ హక్కుల సంఘం చైర్మన్ న్యూడిల్లీకి ఫిర్యాదు చేస్తామని జిల్లా చైర్మన్ పి.సత్యం తెలిపారు.

# బోనాల జాతర ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు



హైదరాబాద్ జూన్ 14 ఈసారి ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలు జూలై 11న, గోల్కొండ జగదాంబా అమ్మవారికి సమర్పించే మొదటి బోనంతో నగరంలో ఉత్సవాలు ప్రాంభమవుతున్నాయి. జూలై 25న సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళీ అమ్మవారికి బోనాల సమర్పణ కార్యక్రమాలుంటాయి. అదే రోజు పాతబస్తీలో బోనాల జాతర ఉత్సవాలు ప్రాంభమవుతాయి. గతేడాదిలా కాకుండా ఈసారి అమ్మవారికి బోనాలను సమర్పించడానికి అవకాశాలుంటాయని భావిస్తున్నారు. ఈ సందర్భంగా భాగ్యనగర్ శ్రీ మహంకాళీ జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు బల్వంత్ యాదవ్ మాట్లాడుతూ భాగ్యనగర్ శ్రీ మహంకాళీ జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో పాతబస్తీలో ఈసారి బోనాల జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ విషయమై మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తోపాటు దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని కలువనున్నాం. వారి సలహాలు, సూచనల మేరకు ఆషాఢ మాస బోనాలలను గతేడాది కన్నా ఘనంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తాం. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ ఆయా దేవాలయాలలో అమ్మ వారికి బోనాలు సమర్పించేలా తగిన ఏర్పాట్లు చేస్తా మన్నారు.ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవాల నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నామన్నారు. గతేడాది కోవిడ్?19 ఆంక్షల నడుమ బోనాల జాతర ఉత్సవాలు ఎలాంటి హంగు ఆర్భాటాలు లేకుండా జరిగాయి. అమ్మవారికి బోనాలను ఆయా దేవాలయాల్లో కాకుండా ఇళ్లల్లోనే నిర్వహించాలని ప్రభుత్వం సూచించడంతో నెల రోజుల పాటు బోనాల జాతర ఉత్సవాలను నిర్వహించారు. భక్తులు లేకుండానే అమ్మవారికి ఆయా దేవాలయాల కమిటి ప్రతినిధులు అమ్మవారికి బోనం సమర్పించారు. ఈసారి వైభవంగా ఉత్సవాలను నిర్వహించడానికి నిర్వాహకులు నెల రోజుల ముందు నుంచే ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే భాగ్యనగర్ శ్రీ మహంకాళీ జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుని ఎన్నిక కూడా పూర్తి అయ్యింది. కమిటి ఆధ్వర్యంలో త్వరలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి బోనాల జాతర ఉత్సవాలపై చర్చించడానికి సిద్ధమవుతున్నారు. ఈ ఏడాది జాతర వివరాలివీ...వచ్చే నెల 25న సికింద్రబాద్ అమ్మవారి బోనాల జాతర రోజే పాతబస్తీలో కాశీవిశ్వనాథ ఆలయం నుంచి అమ్మవారి ఘట స్థాపన ఊరేగింపు కొనసాగుతుంది. ఆగస్టు 1న పాతబస్తీలో అమ్మవారికి భక్తులు బోనాల సమర్పన పూజా కార్యక్రమాలుంటాయి. ఆగస్టు 2న పాతబస్తీలో అమ్మవారి ఘటాల సామూహిక ఊరేగింపు కార్యక్రమాలుంటాయి.

# మన ఊరి బడిని కాపాడుకుందాం యుటిఎఫ్

డోన్ జూన్ 14, (న్యూస్ పల్స్) మన ఊరి బడిని కాపాడుకుందాం అని యూటీఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు యన్ యస్ బాబు అన్నారు, స్థానిక డోన్ పాతపేట లో సోమవారం ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సర్క్యులర్ 172 ప్రకారం మన ఊరిలో 1 నుండి 5 వ తరగతి వరకు కొనసాగుతున్న బడి కనుమరుగయ్యే అవకాశం ఉందని కనుక మన ఊరి బడిని మనం కాపాడుకొని నిలబెట్టుకోవాలని యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎన్ ఎస్ బాబు,రాష్ట్ర కౌన్సిలర్ సుబ్బారెడ్డి,జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి పేర్కొన్నారు.గత రెండు సంవత్సరాలుగా మన బడిలో చాలా మార్పులు వచ్చాయని అన్నారు.నాడు నేడు పనులతో బడులు చూడముచ్చటగా మారాయని,విద్యా కానుకగా బడి సంచిలో పిల్లలకు కావాల్సినవన్నీ ఇచ్చారని ,పిల్లల్ని బడికి పంపుతున్నందుకు తల్లికి 15000 రూపాయలు అమ్మ ఒడి కింద ఇచ్చారని అన్నారు.దీంతో బడిలో పిల్లలు బాగా పెరిగారని,ఇప్పుడు ప్రభుత్వం ఎల్ కే జి,యు కే జి చదువులు కూడా ప్రాథమిక విద్య లోకి తెస్తున్నారని దీనివల్ల మన బడి మరింత బలపడుతుందని కానీ మన బడి నుండి 3,4,5 తరగతుల పిల్లల్ని దూరంగా ఉండే ఉన్నత పాఠశాలకు పంపుతామని అంటున్నారని అన్నారు.ఈ విధంగా చేయడం వల్ల డ్రాప్ అవుట్ పెరిగే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు.కావున ప్రాథమిక తరగతులను విద్యా సంస్కరణలు పేరిట విభజించ వద్దు అని డిమాండ్ చేశారు.సమావేశం అనంతరం మన ఊరి బడిని మనమే కాపాడుకుందాం కరపత్రాలు ఆవిష్కరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సీనియర్ నాయకులు మాణిక్యం శెట్టి,సుబ్బరాయుడు,లతీఫ్,లక్ష్మి రామ్మూర్తి,వెంకటేశ్వర్లు,హుస్సేన్ బాషా,వెంకటేశ్ గౌడ్,సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు

# రక్తదాత మురిగిపూడి సతీష్ కుమార్ కు ఘన సన్మానం

నెల్లూరు జూన్ 14, (న్యూస్ పల్స్) ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా 80 సార్లు రక్తదానం చేసిన రక్తదాత మురిగిపూడి సతీష్ కుమార్ను పినాకిని వెల్ఫేర్ అసోసియేషన్ సోమవారం ఘనంగా సన్మానించింది. స్థానిక బాలాజీ నగర్ ప్రాంతంలో ఉన్న గీతా మయి వృద్ధుల ఆశ్రమం నందు ప్రపంచ రక్తదాతల దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాత లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు మాట్లాడుతూ ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ ప్రతి 3 నెలలకు ఒకసారి రక్తదానం చేయాల్సి ఉందన్నారు. జె.డి.ఫౌండేషన్ మరియు పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నెల్లూరు బాలాజీ నగర్ లోని గీతామయి వృద్ధుల ఆశ్రమం నందు ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా 80 సార్లు రక్తదానం చేసిన రక్తదాత మురిగిపూడి సతీష్ కుమార్ ను ఘనంగా సన్మానించడం మా అదృష్టంగా భావిస్తున్నామన్నారు. రక్తదానంపై ప్రజల్లో ఎన్నో అపోహలు ఉన్నాయని తమ అభిప్రాయాలు వెల్లడించారు. రక్తదాతల నుండి ఒకసారి ఒక యూనిట్ అంటే 350 మిల్లీ లీటర్ల రక్తం మాత్రమే సేకరిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తమ్మినేని పాండు, మురళీ మోహన్ రాజు, దగ్గుపాటి రాధా కృష్ణ, తూములూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# టౌన్,రూరల్ పోలీస్ స్టేషన్లకు స్టార్ ఫౌండేషన్ రెండు ఆక్సిజన్ కాన్సెంటేటర్స్ వితరణ

నర్సీపట్నంజూన్ 14, (న్యూస్ పల్స్)సోమవారం నర్సీపట్నం టౌన్ పోలీస్ స్టేషన్ లో స్టార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆక్సిజన్ కాన్సెంటేటర్స్ అందజేశారు.ఈ కార్యక్రమంకు స్టార్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ హాజరై ఏ ఎస్ పి తూహిన్ సిన్హాకు రెండు ఆక్సిజన్ కాన్సెంటేటర్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ పెద్ద బొడ్డేపల్లి ఆర్ సి ఎం 87 బ్యాచ్ సభ్యులంతా కలసి స్టార్ ఫౌండేషన్ ను ఏర్పాటు చేసి ఎన్నో ఏళ్లుగా నర్సీపట్నం ప్రాంతంలో లో సమాజానికి ఉపయోగపడే అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు పాఠశాలలో చదువుకున్న తమ తోటి విద్యార్థులు అంతా ఇప్పటికే నర్సీపట్నం ప్రాంతంలో అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రస్తుతం కరోనా నేపథ్యంలో ఫ్రంట్ లైన్ వర్కర్స్ గా పనిచేస్తున్న పోలీసులకు రెండు గ్యాస్ కాన్సెంటేటర్స్ స్టార్ ఫౌండేషన్ నుండి ఇవ్వడం జరిగిందన్నారు.స్టార్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ బి ఎస్ ఆర్ శర్మ మాట్లాడుతూ మా మిత్రులు ఎన్ ఆర్ ఐ లు ఎస్ గంగాధర్,టి సూర్య చంద్రలు సౌజన్యం తో సేవా కార్యక్రమలు చేస్తున్నామన్నారు.సుమారు లక్షా పదివేలు విలువ చేసే రెండు ఆక్సిజన్ కాన్సెంటేటర్స్ టౌన్,రూరల్ పోలీస్ స్టేషన్లకు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సి ఐ స్వామి నాయుడు, ఎస్ ఐ లక్ష్మణరావు, స్టార్ ఫౌండేషన్ సభ్యులు సెక్రటరీ నాగిరెడ్డి, ప్రభాకర్,వుడా రాము, దేవత కామేశ్వరరావు ,తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర వార్షిక రుణ ప్రణాళిక విడుదల

తాడేపల్లి జూన్ 14, (న్యూస్ పల్స్)సీఎం వైఎస్ జగన్ వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేసారు. 2.83 లక్షల కోట్ల రుణ ప్రణాళిక రూపొందించారు. 1.48 లక్షల కోట్లు వ్యవసాయానికి కేటాయించారు. మొత్తం ప్రాథమిక రంగానికి 2.13 లక్షల కోట్ల రుణాలు ఇవ్వాలని నిర్ణయం జరిగిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కురసాల కన్నబాబు అన్నారు. గత ఏడాది లక్ష్యాలను సాధించాం...ఈ ఏడాది కూడా సాధిస్తాం. ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలకు బ్యాంకర్లు సహకారం అందించాలని కోరామని అన్నారు. వైద్య కళాశాలలు, జగనన్న కాలనీల అభివృద్ధి వంటి వాటికి సహకటించాలని సీఎం కోరారు. కోవిడ్ ఇబ్బంది ఉన్నా లక్ష్యాలను సాధిస్తాం. కౌలు రైతులకు ఈ ఏడాది మరింత రుణాలు ఇవ్వాలని కోరాం. రాష్ట్ర అభివృద్ధికి చేపట్టే పథకాలకు బ్యాంకర్లు సహకరించాలని సీఎం కోరారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల విషయంలో రుణాలకు ప్రధాన్యం ఇవ్వాలని సూచించారని మంత్రి వెల్లడించారు.

# పదవ తరగతి పరీక్షలను రద్దు చేయాలి....

## ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర అధ్యక్షులు నాగ మధు యాదవ్

ఎమ్మిగనూరు జూన్ 14, (న్యూస్ పల్స్)రాష్ట్రంలో కోవిడ్ వ్యాప్తి రోజురోజుకు తీవ్రం అవుతున్న దృష్ట్యా పదవతరగతి ఆన్లైన్ క్లాస్ లను రద్దుచేసి , గత సంవత్సరం మాదిరిగానే ఈ విద్యా సంవత్సరం కూడా పదవ తరగతి పరీక్షలు రద్దు చేసి, విద్యార్థులందరినీ ఉత్తీర్ణులు గా ప్రకటించాలని కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం ఎన్ఎస్యుఐ రాష్ట్ర అధ్యక్షుడు నాగ మధు యాదవ్ ఆధ్వర్యంలో ఎన్ఎస్యుఐ రాష్ట్ర స్థాయి పిలుపుమేరకు జిల్లా విద్యాశాఖ అధికారి సాయిరాం తన ఛాంబర్లో కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది

# లూజు, దళారీలు అమ్మే విత్తనాలతో జాగ్రత్త...

## ఏడిఏ మహమ్మద్ ఖాద్రి

తుగ్గలి/మద్దికెర ( విభారె) ప్రస్తుతం ప్రారంభం కానున్న ఖరీఫ్ సీజన్లో రైతులు విత్తనాల కొనుగోలులో పూర్తి జాగ్రత్త వహించాలని పత్తికొండ ఏ డి ఏ మహమ్మద్ ఖాద్రి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు దళారులు,లూజు విత్తనాలు అమ్మి మోసం చేస్తుంటారు. అసలు లూజు మరియు కంపెనీల ద్వారా అమ్మే విత్తనాల తేడాలు తెలుసుకుంటే చాలా మంచిది. వాటి వివరాలు పత్తికొండ సహాయ వ్యవసాయ సంచాలకులు షేక్ మహమ్మద్ ఖాద్రి మాటలలో....దళారుల ద్వారా అమ్మే లూజు విత్తనాలు.. ఈ విత్తనములు తయారీలో కంపెనీ వారి, ధ్రువీకరణ అధికారుల ప్రమేయం ఉండదు. ఈ విత్తనాలు అమ్మినప్పుడు ఎటువంటి బిల్లును ఇవ్వరు. ఈ విత్తనాల తయారీలో ఎటువంటి ప్రాసెసింగ్, శుద్ధి మరియు ఇతర ప్రమాణాలు పాటించరు. ఈ విత్తనాలకు ఎటువంటి నాణ్యత ఉ ండదు. ఈ విత్తనాలకు ఎటువంటి జన్యు నాన్యత ఉండదు. ఈ విత్తనాలను విత్తినప్పుడు మరియు పంట మధ్యకాలంలో, పూత కాత దశలో ఏమైనా నష్టాలు జరిగిన రైతుకు న్యాయం జరగదు. ఈ విత్తనాలను దళారీలు రైతులను మోసం చేసే వారు మాత్రమే విక్రయిస్తారు. కంపెనీ ద్వారా మరియు డీలర్ల ద్వారా అమ్మే విత్తనాలు... ఈ విత్తనము తయారీలో వివిధ దశలలో కంపెనీ మరియు ధ్రువీకరణ అధికారుల పర్యవేక్షణ ఉ ంటుంది. ఈ విత్తనాలను అమ్మినప్పుడు రైతులకు తప్పకుండా బిల్లు ఇస్తారు. ఈ విత్తనాల తయారీలో ప్రాసెసింగ్, శుద్ధి మరియు ఇతర నాణ్యత ప్రమాణాలు పాటిస్తారు. ఈ విత్తనాలకు పూర్తి నాణ్యత ఉంటుంది. ఈ విత్తనములకు ఖచ్చితమైన జన్యు నాణ్యత ఉంటుంది. ఈ విత్తనాలు అమ్మినప్పుడు రైతులకు బిల్లులు ఇస్తారు కాబట్టి రైతులకు పూర్తి న్యాయం జరుగుతుంది. ఈ విత్తనాలు వ్యవసాయ శాఖ ద్వారా లైసెన్సు పొందిన డీలర్లు విక్రయిస్తారు. కావున రైతు సోదరులు అందరూ లైసెన్సు కలిగిన డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేసి రసీదు లేదా బిల్లు పొంది పంటకాలం పూర్తయ్యేవరకూ జాగ్రత్తగా ఎత్తి పెట్టుకోవాలి. అలాగే గ్రామాలలో ఎవరైనా లూజు విత్తనాలను అమ్ముతుంటే సంబంధిత వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వగలరు. విత్తనాల కొనుగోలు విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలివిత్తన కొనుగోలులో.. వ్యవసాయ శాఖ లైసెన్స్ పొందిన అధీకృత డీలర్ల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలి. విత్తన కొనుగోలు బిల్లుపై నెంబర్, విత్తన రకం, గడువు తేదీలు, డీలర్ సంతకం, రైతు సంతకం బిల్లుపై ఉండేలా చూసుకోవాలి. లూజుగా ఉన్న సంచులు, పగిలిన పాకెట్స్, తెరిచిన డబ్బాల నుంచి విత్తనాలు కొనొద్దు. గడువు దాటిన విత్తనాల జోలికి వెళ్ళవద్దు. బిల్లుపై విక్రయదారుడి పేరు, రైతు పేరు, గ్రామం పేరు, నికర ధర, కంపెనీ పేరు తప్పనిసరిగా నమోదు చెయ్యాలి. విక్రయదారుడు ఇచ్చే కరపత్రాలు తీసుకొని వాటిలో పేర్కొన్న అంశాలను చదవాలి. విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లులను పంట కాలం పూర్తయ్యే వరకు దాచి పెట్టుకోవాలి. × అరువు పద్దతిలో కొనొగోలు చేసినప్పటికీ బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలని యస్.యం.డి. ఖాద్రి,సహాయ వ్యవసాయ సంచాలకులు రైతులకు తెలియజేశారు.

# కంటతడి పెడుతున్న అన్నదాతలు..

### భూముల సర్వే చేయాలంటే లంచం ఇవ్వాల్సిందే....
### వీఆర్వో ను బదిలీ చేసి మా గ్రామానికి నూతన వీఆర్వోకు బాధ్యతలు ఇవ్వాలని రైతులు డిమాండ్...

కౌతాళం ( విభారె) మండల పరిధిలోని నదిచాగి గ్రామంలోని భూములను సర్వే చేయాలంటే అధికారి రెవిన్యూ వీఆర్వో కు అంతో ఇంతో ఇస్తేనే సర్వే చేస్తాం. లేకుంటే లేదని తెగేసి చెప్తున్న ఆ గ్రామ రెవిన్యూ అధికారి. అన్నదాతలు విసుగుచెందుతున్నారు, భూముల సర్వే చేసేందుకు డీడీ తీసిన తరువాత భూముల సర్వే చేసేందుకు వీఆర్వో కు సర్వేయర్ కు మామూళ్లు ఇస్తేనే సర్వే చేసేందుకు దిగుతారు లేకుంటే పెండింగులో ఉంచుతారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిగారు ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామ స్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలును పారదర్శకంగా అందించేలా గ్రామ సచివాలయలను నిర్మిచి నెలకొల్పింది. రైతన్నలకు ప్రజలుకు అన్నివర్గాల వారికి అందుబాటులో ఉండేలా సచివాలయం సిబ్బంది నియామకాలను చేపట్టింది. కానీ అందులో పనిచేసే కొందరు సిబ్బంది లంచాలకు పాలుపడ్డారు మామూళ్లు పర్వనికి తెరదించుతున్నారు ప్రభుత్వ ఆశయానికి గండి కొడుత్తన్నారు. విఆర్వో రామాంజనేయులు, సర్వేయర్ శ్రీదేవి భూ సర్వే పేరుతో రైతుల నుంచి మామూళ్లు వసూళ్లకు పాల్పడుతున్నారు. రైతుల వద్ద నుంచి రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకు మముళ్ళను వాసులు చేసిన తర్వాతనే భూములను సర్వే చేసేందుకు ముందుకొస్తున్నారు అన్న ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఇటీవల గ్రామంలో పలువురు రైతులు భూములను సర్వే చేయించుకోగా ఒక్కొక్క రైతునుంచి రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకు పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. డబ్బులు ఇస్తేనే మీ పొలాలను సర్వే చేస్తామని సచివాలయం సర్వేయర్, వీఆర్వో తెగేసి చెబుతుండడంతో. రైతులు చేసేదేమీ లేక డబ్బులు ఇచ్చి పనులు చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామంలో లంచావతారమెత్తిన సదరు విఆర్వో, సర్వేయర్ పై జిల్లా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోని మా గ్రామానికి కొత్త వీఆర్వో కు బాధ్యతలు ఇవ్వాలని రైతులు కోరుతూ ఆవేదన వ్యక్తం చేశారు...

# స్పందన కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరిస్తాం

### నంద్యాల ఇంచార్జ్ ఆర్ డి ఓ. సి వెంకట నారాయణమ్మ

నంద్యాల జూన్ 14 స్పందన కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరిస్తాం అనినంద్యాల ఇంచార్జ్ ఆర్ డి ఓ. సి వెంకట నారాయణమ్మ అన్నారు. సోమవారం నంద్యాల ఆర్డీవో కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమం లో నంద్యాల ఇంచార్జ్ ఆర్ డి ఓ. సి. వెంకట నారాయణమ్మ అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరించారు. ఇంచార్జి ఆర్ డి ఓ .సి. వెంకట నారాయణమ్మ మాట్లాడుతూ ఆర్డీవో కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని నంద్యాల రెవెన్యూ డివిజన్ లోని అర్జీదారులు అర్జీలు సమర్పించారు. సోమవారం నాడు జరిగిన కార్యక్రమంలోభూములను సర్వే చేయించాలని. భూములను ఆక్రమించుకున్నారని . ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న చేయూత కార్యక్రమం ద్వారా మాకు లబ్ధి పొందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ భూములకు సంబంధించి ఆర్ ఓ ఆర్ కేసులు భూతగాదాలు

# మీకే కాదు, మీ పక్కవారికి కూడా ఇబ్బంది కలిగించే చెమట వాసనకు వీడ్కోలు చెప్పాలనుకుంటున్నారా?




శరీర వాసన చాలా మంది తమ దైనందిన జీవితంలో ఎదుర్కొనే సమస్య. అందుకు వివిధ కారణాలు ఉంటాయి, ముఖ్యంగా కొన్ని ఉత్పత్తులు, ఆహారాలు, శారీరక శ్రమ ప్రధానకారణం కావచ్చు. కానీ బహిరంగ ప్రదేశాలకు వెళ్ళేటప్పుడు, మీరు ఎల్లప్పుడూ ఎక్కువగా చెమట పడుతుంటే, మీరు చాలా ఇబ్బందిని ఎదుర్కోవలసి ఉంటుంది.ఒక వ్యక్తి ఎక్కువగా చెమట పట్టడానికి చెమట గ్రంథులు ఎక్కువగా పనిచేస్తాయి. చర్మంలోని బ్యాక్టీరియాతో పాటు చెమటలు పట్టడం వల్ల తీవ్రమైన వాసన వస్తుంది. ప్రతిదీ చాలా చెమటలు పట్టే కారణాలు ఎవరికైనా తెలుసా?అధిక కెఫిన్ పానీయాలు, కొన్ని మందులు, కారంగా ఉండే ఆహారాలు, గట్టి దుస్తులు, నిర్జలీకరణం, ఒత్తిడి మరియు ఉద్రిక్తత, మద్యపానం, సరైన ఆహారం, హార్మోన్ల మార్పులు మరియు యుక్తవయస్సు ప్రధాన కారణాలు.కొంతమంది శరీర దుర్వాసన నుండి బయటపడటానికి డియోడరెంట్లను ఉపయోగిస్తారు. అయితే ఆ దుర్గంధనాశని తాత్కాలికమేనని మర్చిపోవద్దు. శరీర వాసన నుండి శాశ్వత పరిష్కారం కావాలంటే, మీరు శుభ్రంగా ఉండాలి మరియు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు కలిగి ఉండాలి.శరీర దుర్వాసన నుండి బయటపడటానికి కొన్ని సహజ మార్గాలు ఉన్నాయి. క్రింద ఆ సాధారణ సహజ పరిష్కారాలు ఉన్నాయి. ఇది చదివి దానిని అనుసరించండి మరియు శరీర వాసనకు వీడ్కోలు చెప్పండి.బేకింగ్ సోడా చర్మం నుండి తేమను పీల్చుకోవడానికి మరియు శరీర వాసనను తగ్గించడానికి సహాయపడుతుంది. ఇది బ్యాక్టీరియాను కూడా చంపుతుంది మరియు సహజ దుర్గంధనాశని వలె పనిచేస్తుంది.1 టేబుల్ స్పూన్ బేకింగ్ సోడాను 1 టేబుల్ స్పూన్ నిమ్మరసంతో కలపండి, చంకలలో రుద్దండి, కొన్ని నిమిషాలు నానబెట్టి చల్లటి నీటితో శుభ్రం చేసుకోండి. మంచి ఫలితం పొందడానికి రోజూ కొన్ని వారాలు దీన్ని క్రమం తప్పకుండా అనుసరించండి.శరీర దుర్వాసనకు ఆల్కహాల్ మరొక ఔషధంగా చెప్పవచ్చు. ఇది సులభంగా ఆవిరైపోతుంది మరియు వాసనను తగ్గిస్తుంది. ఇది రంధ్రాలను కూడా మూసివేస్తుంది మరియు చెమట ఉత్పత్తిని తగ్గిస్తుంది.ఒక పత్తి బంతిని తీసుకొని, దానిని ఆల్కహాల్‌లో నానబెట్టి, చంకలలో రుద్దండి, కొన్ని నిమిషాలు నానబెట్టి, తరువాత కడగాలి. కాకపోతే, ఒక కప్పు నీటిలో కొద్దిగా ఆల్కహాల్ కలపండి మరియు చంకలను కడగాలి.ఆపిల్ సైడర్ వెనిగర్ లోని యాంటీ బాక్టీరియల్ లక్షణాలు బ్యాక్టీరియా పెరుగుదలను నిరోధిస్తాయి. ఇది ఆరోగ్యకరమైన చర్మం నిర్వహించడానికి మరియు శరీర వాసనను తొలగించడానికి సహాయపడుతుంది.ఆపిల్ సైడర్ వెనిగర్ ను కాటన్ బాల్ లో నానబెట్టి, చంకలలో రుద్ది, 2-3 నిమిషాలు నానబెట్టి, తరువాత నీటితో శుభ్రం చేసుకోండి. రోజూ ఉదయం మరియు రాత్రి పడుకునే ముందు 2 సార్లు ఇలా చేయడం వల్ల చెమట వాసన తొలగిపోతుంది.రోజ్ వాటర్ చంక వాసన నుండి బయటపడటానికి సహాయపడుతుంది. చంకలపై కొద్దిగా రోజ్ వాటర్ రాయండి. కాకపోతే, స్నానపు నీటిలో కొద్దిగా రోజ్ వాటర్ కలపండి మరియు స్నానం చేయండి. అందువలన శరీరం రోజంతా మంచి వాసనతో ఉంటుందిటమోటాలలోని ఆమ్లత్వం వాసన కలిగించే బ్యాక్టీరియాను చంపి రంధ్రాలను తగ్గిస్తుంది. అందువల్ల ఇది శరీరం నుండి చెమట వీచే వాసనను తగ్గించడానికి సహాయపడుతుంది.టొమాటో పేస్ట్‌ను నేరుగా చంకలపై వేసి 15 నిమిషాలు నానబెట్టి, చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలి. మీరు కొన్ని వారాలు ప్రతిరోజూ దీనిని అనుసరిస్తే, మీరు మంచి ఫలితాన్ని పొందవచ్చు.శరీర దుర్వాసన నుండి బయటపడటానికి పురాతన కాలం నుండి నిమ్మకాయను ఉపయోగిస్తున్నారు. రోజూ స్నానం చేసే ముందు, నిమ్మకాయ ముక్కను చంకలో రుద్దండి. బాగా ఎండిన తరువాత, స్నానం చేయండి. రోజూ ఇలా చేయడం వల్ల శరీర దుర్వాసన రాకుండా ఉంటుంది.పాలకూర శరీర వాసనను నివారించడానికి సహాయపడే ఆకుకూర. కొద్దిగా పాలకూర రసాన్ని నేరుగా చంకలపై వేయండి. ఉత్తమ ఫలితాల కోసం, స్నానం చేసిన తరువాత, ఈ బచ్చలికూర సారాన్ని చంకలపై పూయండి మరియు పొడిగా ఉంచండి. కావాలనుకుంటే, పాలకూర రసాన్ని ఫ్రిజ్‌లో భద్రపరుచుకుని రోజూ వాడవచ్చు.గంధపు పొడి వివిధ సౌందర్య ప్రయోజనాలను కలిగి ఉంటుంది మరియు మంచి వాసన కలిగి ఉంటుంది. ప్రధానంగా చందనం చంకల నుండి వాసనను తొలగించడానికి సహాయపడుతుంది.గంధపు పొడి తీసుకొని నీటితో అతికించండి

## ఆనంద్‌ను మోసం చేసి ఓడించాను.. క్షమించండి!

ముంబై: అతడు చెస్‌లో ఐదుసార్లు వరల్డ్ చాంపియన్. అలాంటి ప్లేయర్‌ను ఆ గేమ్‌లో అనామకుడు, ఓ వ్యాపారవేత్త ఓడించడం చాలా మందిని ఆశ్చర్యానికి గురి చేసింది. అయితే దానికి వెనుక అసలు కారణం ఇప్పుడు బయటకు వచ్చింది. కొవిడ్ సహాయ నిధి కోసం విరాళాలు సేకరించడానికి చెస్ కింగ్ విశ్వనాథన్ ఆనంద్.. పలువురు సెలబ్రిటీలతో ఆదివారం చెస్ గేమ్స్ ఆడాడు. అందులో ఆమిర్ ఖాన్, రితేష్ దేశ్‌ముఖ్‌లాంటి బాలీవుడ్ ప్రముఖులు కూడా ఉన్నారు. అయితే వీళ్లలో జెరోదా కంపెనీ కోఫౌండర్ అయిన నిఖిల్ కామత్.. తాను ఆడిన గేమ్‌లో ఆనంద్‌ను ఓడించాడు. ఇది చాలా మందిని ఆశ్చర్యానికి గురి చేసింది.కానీ తాజాగా అతనే దీనిపై స్పష్టతనిచ్చాడు. అందరూ నేను ఆనంద్‌పై గెలిచానని అనుకుంటున్నారు. కానీ గేమ్‌ను చూస్తున్న నిపుణులు, కంప్యూటర్ల సాయంతో ఆడి నేను గెలిచాను. ఇలా చేసినందుకు క్షమించాలి అని కామత్ ట్వీట్ చేశాడు. ఓ చారిటీ మ్యాచ్‌లో ఇలా మోసం చేసి గెలవడం దురదృష్టకరమని, ఇలా జరిగి ఉండాల్సింది

# బింబిసార' కోసం ఎన్టీఆర్ అంతకు మించి..!




ఒకప్పటితో పోల్చితే గత కొంత కాలంగా నందమూరి బ్రదర్స్ ఎన్టీఆర్ మరియు కళ్యాణ్ రామ్ ల మద్య అనుబంధం మరింతగా పెరిగినట్లుగా అనిపిస్తుంది. గతంలోనూ ఇద్దరు సన్నిహితంగా ఉన్నా బయటకు మాత్రం వారి సన్నిహిత్యం కనిపించక పోయేది. కాని వీరిద్దరు ఒకరి సినిమాల్లో మరొకరి ఇన్వాల్వ్ మెంట్ తో ఈమద్య మరింత క్లోజ్ అయినట్లుగా అభిమానులకు కనిపిస్తున్నారు. కళ్యాణ్ రామ్ ను హీరోగా సక్సెస్ లతో నిలబెట్టేందుకు ఎన్టీఆర్ తనకు సాధ్యం అయినంత వరకు సాయంగా నిలుస్తున్నాడు. అంతే కాకుండా తన ప్రతి సినిమా నిర్మాణ వ్యవహారంలో ముందు ముందు కళ్యాణ్ రామ్ ను ఇన్వాల్వ్ చేయబోతున్నట్లుగా కొరటాల శివ సినిమా ద్వారా చెప్పకనే చెప్పాడు. ఇక కళ్యాణ్ రామ్ ప్రస్తుతం 'బింబిసార' అనే భారీ పౌరాణిక చిత్రంను చేస్తున్న విషయం తెల్సిందే. ఈ సినిమా కోసం కళ్యాణ్ రామ్ అన్ని రకాలుగా చాలా కష్టపడుతున్నాడు. అందుకే అన్న కోసం ఎన్టీఆర్ తనవంతు సహకారంను అందించేందుకు ముందుకు వస్తున్నాడట. ఇండస్ట్రీ వర్గాల ద్వారా అందుతున్న విశ్వసనీయ సమాచారం మేరకు ఎన్టీఆర్ బింబిసార స్క్రిప్ట్ ను ఒకటికి రెండు సార్లు విని పలు మార్పులు చేర్పులు సూచించాడట. దానికి తోడు సినిమాలోని పలు సన్నివేశాల విషయంలో కూడా ఎన్టీఆర్ సూచనలు చేసినట్లుగా చెబుతున్నారు.సినిమాకు సంబంధించి మరో కీలక విషయం ఏంటీ అంటే ఈ ఈసినిమా కోసం ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ ఇవ్వబోతున్నాడట. సినిమా ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ తో మొదలు కాబోతుందట. అలా మొదలు అయిన సినిమా ప్రేక్షకులను ఓ రేంజ్ కు తీసుకు వెళ్లబోతుందట. సినిమా మద్య మద్యలో కూడా ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ ఉంటుందని అంటున్నారు. ఇక విడుదల సమయంలో సహజంగానే ఎన్టీఆర్ ప్రమోషన్ కార్యక్రమాల్లో పాల్గొనడం జరుగుతుంది. మొత్తానికి బింబిసార కోసం ఎన్టీఆర్ అంతకు మించి అన్నట్లుగా తన సహకారంను అందించబోతున్నాడు.

# 'సర్కారు వారి పాట' అప్డేట్స్ పై మేకర్స్ క్లారిటీ..!




కరోనా మహమ్మారి ఫస్ట్ వేవ్ కారణంగా తెలుగు ఇండస్ట్రీలో ఎన్నో మార్పులు జరిగాయి. ప్రస్తుతం కరోనా సెకండ్ వేవ్ వ్యాప్తి చెందుతుండటంతో ఇండస్ట్రీలో మళ్లీ సినిమా కష్టాలు నెలకొన్నాయి. ఇప్పటికే రిలీజ్ అవ్వాల్సిన అన్ని సినిమాలు వాయిదా పడగా.. మరికొన్ని సినిమాలు షూటింగ్స్ ఆపేసి ఇంట్లో కూర్చొనే పరిస్థితి వచ్చింది. ఇలాంటి సమయంలో ఏ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుంది అనేది చెప్పడం చాలా కష్టం. అసలు షూటింగ్స్ చేయడమే కష్టంగా కనిపిస్తుంది. కానీ తాజా సమాచారం ప్రకారం.. దేశంలో కరోనా ప్రభావం తగ్గుముఖం పడుతుండటంతో సినిమా షూటింగ్స్ త్వరగా ప్రారంభించే దిశగా మేకర్స్ ఆలోచన చేస్తున్నారు.అయితే సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా నటిస్తున్న 'సర్కారు వారి పాట' సినిమా మేకర్స్ కూడా త్వరలోనే షూటింగ్ ప్రారంభించాలని షెడ్యూల్ రెడీ చేస్తున్నారట. ఇప్పటికే సర్కారు వారి మూవీ వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల అవుతుందని మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. కానీ తాజాగా ఈ సినిమా సంక్రాంతి కాకుండా ఈ ఏడాది చివరిలోనే విడుదల చేసే ప్లాన్ లో మహేష్ ఉన్నట్లు టాక్ నడుస్తుంది. ఎందుకంటే వచ్చే ఏడాది కోసం ఆల్రెడీ మహేష్ త్రివిక్రమ్ సినిమాను లైన్ లో పెట్టేసాడు. అందుకే వీలైనంత త్వరగా సర్కారు పాట ఫినిష్ చేసేయాలని భావిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి.ఇటీవలే సర్కారు వారి పాట షూటింగ్ జులైలో ప్రారంభం కథనాలు వినిపించాయి. ఈ సినిమాలో మహేష్ పూర్తిగా న్యూ లుక్కులో కనిపించనున్నాడు. మొన్నే అప్డేట్స్ వస్తాయని ఫ్యాన్స్ ఆశించారు. ఆ విషయంలో అభిమానులకి నిరాశే మిగిలింది. కానీ తాజాగా సూపర్ స్టార్ సర్కారు వారి చిత్రబృందం నుండి అధికారికంగా ఓ కబురు పంపారు. ఏంటంటే.. "సర్కారు వారి పాట షూటింగ్ మొదలైన వెంటనే అప్డేట్స్ ఇవ్వడం స్టార్ట్ చేస్తాం. అంతవరకూ అందరూ జాగ్రత్తగా ఉండండి.. కోవిడ్ ప్రోటోకాల్ పాటించండి" అంటూ పిలుపునిచ్చారు. ఆశ్చర్యం అనిపించినా మేకర్స్ ఇచ్చిన అప్డేట్ మాత్రం ఇదే. కాబట్టి సర్కార్ అప్డేట్స్ కోసం ఇంకొంతకాలం ఆగాల్సిందే. ఈ సినిమాలో కీర్తిసురేష్ హీరోయిన్ కాగా.. ఈ సినిమాను మైత్రి మూవీ మేకర్స్ - 14రీల్స్ ఎంటర్టైన్మెంట్స్ తో పాటు మహేష్ కూడా నిర్మిస్తున్నాడు.

# ఇస్మార్ట్ సుందరి హీరోలకు ధీటుగా రికార్డులు బద్దలు..!

టాలీవుడ్ యంగ్ గ్లామర్ క్వీన్ నిధి అగర్వాల్. ఈ ఇస్మార్ట్ బ్యూటీ గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. ముంబైలో సెటిల్ అయినటువంటి ఈ హైదరాబాదీ బ్యూటీ.. టైగర్ ష్రాఫ్ సరసన 'మున్నా మైకెల్' అనే సినిమాతో హీరోయిన్ గా సినీ ప్రయాణం ప్రారంభించింది. డెబ్యూ మూవీలో ఈ గ్లామర్ బ్యూటీని చూసి ప్రతి ఒక్కరు బాబోయ్ అదిరింది అనుకున్నారు. ఎందుకంటే ఫస్ట్ సినిమాలోనే అమ్మడి టాప్ టు బాటమ్ గ్లామర్ షో చేసేసింది. ఆ సినిమా ఆశించినంతగా ఆడలేదు. అలాగే వయ్యారికి అవకాశాలు కూడా రాలేదు. ఇక ఎలాంటి ఆలస్యం చేయకుండా నిధి 'సవ్యసాచి' సినిమాతో తెలుగులో అరంగేట్రం చేసింది.ఆ మూవీ కూడా ప్లాప్ అవ్వడంతో అమ్మడు గ్యాప్ తీసుకొని మరీ 'మిస్టర్ మజ్ను' సినిమా చేసింది. ఆఖరికి ఈ సినిమా కూడా ప్లాప్. వరుసగా చేస్తున్న సినిమాలన్నీ బోల్తా కొట్టడంతో ఏం చేయాలో తెలియక మరో భారీ విరామం తీసుకొని అమ్మడు.. ఇస్మార్ట్ శంకర్ సినిమా చేసింది. ఈ సినిమాలో మొత్తంగా అందాలు ఆరబోసి మొదటి హిట్ అందుకుంది. ఈ సినిమాతో తెలుగు యువతకు అమ్మడు గ్లామర్ క్వీన్ అయిపోయింది. అయితే సినిమాలు చేస్తోంది కానీ స్టార్డం అందుకోలేకపోతుంది. ఇదిలా ఉండగా.. తెలుగు సినిమాలు యూట్యూబ్ వేదికగా హిందీలో డబ్ అవుతుంటాయని తెలిసిందే. ఈ మధ్యకాలంలో తెలుగులో ఫెయిల్ అయినటువంటి సినిమాలు యూట్యూబ్ లో హిందీ వెర్షన్ కోట్లలో వ్యూస్ తెచ్చుకొని మిలియన్స్ రికార్డులు బ్రేక్ చేస్తున్నాయి.అయితే మాములుగా హీరోయిన్స్ యూట్యూబ్ రికార్డులు బ్రేక్ చేయడం గురించి అరుదుగా వింటుంటాం. కానీ నిధి అగర్వాల్ అలా కాదు. తాను ఇప్పటివరకు చేసిన తెలుగు సినిమాలు అన్నింటితో యూట్యూబ్ లో రికార్డులు నమోదు చేసింది.హీరోయిన్స్అంటేసాంగ్స్ తోయూట్యూబ్ రికార్డులు కొల్లగొట్టడం చూసాం. కానీ అమ్మడు నటించిన సినిమాలు హిందీ డబ్ వెర్షన్ లో వందల సంఖ్యలో మిలియన్స్ నమోదు చేస్తున్నాయి. ప్రస్తుతం నిధి నటించిన ఫస్ట్ మూవీ సవ్యసాచి 130మిలియన్స్ క్రాస్ చేయగా.. ఇక మిస్టర్ మజ్ను మూవీ 200 మిలియన్స్ కాగా.. నిధి ఫస్ట్ హిట్ ఇస్మార్ట్ శంకర్ మూవీ ఏకంగా 202 మిలియన్స్ క్రాస్ చేసి ముందంజలో ఉంది. ప్రస్తుతం ఈ విషయంలో నిధి కూడా హీరోలకు పోటీగా నిలుస్తుంది అనడంలో సందేహం లేదు. అమ్మడి ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఇక ప్రస్తుతం నిధి పవన్ కళ్యాణ్ సరసన హరిహర వీరమల్లు సినిమా చేస్తుంది.

# 'పానీ పానీ' అంటూ మేకింగ్ వీడియోతో స్టార్ హీరోయిన్ హల్చల్..!

శ్రీలంకన్ బ్యూటీ జాక్వెలిన్ ఫెర్నాండెజ్.. బాలీవుడ్ ఇండస్ట్రీలో తన హవా కంటిన్యూ చేస్తోంది. ఎల్లప్పుడూ సినిమాలతో పాటు సోషల్ మీడియాలో యాక్టీవ్ గా ఉండే జాక్వెలిన్ తాజాగా మరో ప్రైవేట్ సాంగ్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. జాక్వెలిన్ ఫెర్నాండెజ్ ఏ భారతీయ సంప్రదాయ దుస్తులలో అయినా



తన మార్క్ క్రియేట్ చేసుకునే ప్రయత్నం చేస్తోంది. ఇప్పటివరకు సినీ కెరీర్ పరంగా అమ్మడు మొత్తం ఇండియన్ కాస్ట్యూమ్స్ ఎక్కువగా ధరించినట్లు తెలుస్తుంది. ఇదివరకు రాపర్ పాప్ సింగర్ బాద్షాతో కలిసి జాక్వెలిన్ 'గెండా పూల్' సాంగ్ లో అందరి మనసులు గెలుచుకుంది. ఆ పాటలో బెంగాలీ వస్త్రాధారణను మనం చూడవచ్చు.అయితే తాజాగా బాద్షాతో కలిసి 'పానీ పానీ' అనే సరికొత్త పాటతో ముందుకు వచ్చింది. గెండాపూల్ కోసం బెంగాలీ అవతారంలో కనిపించిన జాక్వెలిన్.. ఈసారి పానీపానీ పాటలో రెడ్ అండ్ వైట్ సారీతో పాటు ఆభరణాలు అందమైన మేకప్తో సంప్రదాయ రాజస్థాని రూపంలో అలరిస్తుంది. బాద్షా - ఆస్తా గిల్ కలిసి పాడిన ఈ రాజస్థాని స్టైల్ సాంగ్ ఇటువలే రిలీజ్ అయింది. ఈ పెప్పీ ట్రాక్ మ్యూజిక్ వీడియోను రాజస్థాన్ లోని జైసల్మేర్ ప్రాంతంలో షూట్ చేశారు. అయితే ఈ సాంగ్ లిరిక్స్ తో పాటు మ్యూజిక్ కూడా బాద్షానే ఇవ్వడం విశేషం. తాజాగా జాక్వెలిన్ ఈ సాంగ్ గురించి మాట్లాడుతూ.. "బాద్షా పానీపానీ సాంగ్ విషయంలో నా దగ్గరికి వచ్చినప్పుడు నేను వెంటనే ఓకే చెప్పను. ఎందుకంటే ట్రాక్ వింటే ఖచ్చితంగా బాగా కనెక్ట్ అవుతుందని అనిపించింది. ఈ పాటలో మీరు డిఫరెంట్ జాక్వెలిన్ అవతారం చూస్తారు. అద్భుతమైన ఎడారి.. ప్రకృతి అందాల మధ్య ఈ సాంగ్ షూట్ చేసాం." అని చెప్పుకొచ్చింది.అయితే తాజాగా జాక్వెలిన్ తన ఇన్స్టా ఖాతాలో పానీపానీ సాంగ్ మేకింగ్ వీడియో పోస్ట్ చేసింది. ఆ వీడియోలో మనం డిఫరెంట్ రాజస్థాని గెటప్స్ లో జాక్ బ్యూటీని చూడవచ్చు. ఈ ముప్పైఐదేళ్లు పైబడిన గ్లామరస్ బ్యూటీ పానీ పానీ అంటూ అందరి మనసులు దోచుకుంటుంది. ఆ వీడియోలో జాక్ ఉత్సాహం మాములుగా లేదు. కేవలం రెండు రోజుల్లో ఈ సాంగ్ షూట్ పూర్తి చేసినట్లు అమ్మడు తెలిపింది. తాజాగా సోషల్ మీడియాలో జాక్వెలిన్ టాప్ టు బాటమ్ స్టైలిష్ బ్లూ డ్రెస్ ధరించిన పిక్ వైరల్ అవుతోంది. ప్రస్తుతం ఈ సొగసరి పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సరసన 'హరిహర వీరమల్లు' సినిమాతో టాలీవుడ్ డెబ్యూ చేయబోతుంది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**